ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగాలలో ఖాళీగా ఉన్న పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 60 పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్ ×జఖ) - 2, కార్పెంటర్ - 1, బార్బర్ - 3, క్యాటలాగర్ (సెంట్రల్ రికార్డ్స్) - 1, డేటా ఎంట్రీ ఆపరేటర్ - 20, ఎలక్ట్రీషియన్ - 3, ప్లంబర్ - 1, రికార్డు క్లర్క్/రికార్డు అసిస్టెంట్ - 1, రిఫ్రాక్షనిస్ట్/ఆప్టీషియన్ - 1, టైలర్ - 1, ధోబీ - 2, గ్యాస్ ఆపరేటర్ - 2, ల్యాబ్ అటెండెంట్ - 7, ఆఫీస్ సబార్డినేట్ - 8, వీమీ/ఖీమీ - 2, అటెండెంట్ - 4, మ్యూజియం అసిస్టెంట్ కమ్ ఆర్టిస్ట్ - 1 పోస్టులు ఉన్నాయన్నారు.అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 31, 2026 సాయంత్రం 5:00 గంటలలోపు ఆఫ్ లైన్ విధానంలో తమ దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. అభ్యర్థుల విద్యా అర్హతలు, నిబంధనలు మరియు ఇతర పూర్తి సమాచారం కోసం ఖమ్మం జిల్లా అధికారిక వెబ్‌సైట్ https://khammam.telangana.gov.in లేదా వైద్య కళాశాల వెబ్‌సైట్ https://gmckhammam.org లను సందర్శించాలని ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారజోడు రాంబాబు

జనగామ జిల్లా/రఘునాథపల్లి/(అక్షరం న్యూస్) అక్టోబరు 22:

ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారజోడు రాంబాబు కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన మండల కాంగ్రెస్ శ్రేణుల సమావేశానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె మహేందర్ రెడ్డి అధ్యక్షత వహించగా, మారజోడు రాంబాబుతో పాటు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, స్టేషన్ ఘనాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్సీ కో-ఆర్డినేటర్ లింగాల జగదీష్ చందర రెడ్డి, ఖమ్మం జిల్లా ఇన్చార్జీ మాసాన్పల్లి లింగాజీ హాజరై మాట్లాడారు. ఓటు నమోదు చేసుకునేందుకు అర్హులైన వారిని గుర్తించి కొత్త ఓటర్ల నమోదుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని అన్నారు. నవంబరు 6వ తేదీ లోగా మండలంలోని అన్ని గ్రామాలలో ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కోళ్ల రవి. కొలిపాక మల్లేష్, మడికంటి మధు, నారగోని కుమార్, ఎండి. బాషుమియా, ఇబ్రహీం, మేకల నరేందర్ తదితరులు పాల్గొన్నారు



అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం..

టపాసుల నిప్పురవ్వలతో పత్తికి అంటుకున్న మంటలు

ఖమ్మం/వైరా టౌన్ అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

కొణిజర్ల: ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామంలో గురువారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. మేకల ఆదినారాయణ ఇంటి వద్ద చిన్నారులు టపాసులు పేలుస్తుండగా, వాటి నుంచి వెలువడిన నిప్పురవ్వలు పత్తికి అంటుకోవడంతో మంటలు వ్యాపించాయి.వెంటనే అప్రమత్తమైన రైతు ఆదినారాయణ మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.పండుగల సమయంలో చిన్నారులు టపాసులు పేల్చేటప్పుడు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, పత్తి, ఎండుగడ్డి, ఇతర మండే వస్తువులకు దూరంగా టపాసులు పేల్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ ఘటన సూచిస్తోంది.



శ్రీ మహాలక్ష్మి అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాల్లో పాల్గొన్న...

వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్,

సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్

అమ్మవారికి ప్రత్యేక పూజలు.. ఊరేగింపులో పాల్గొని బతుకమ్మ ఎత్తుకున్న ప్రజాప్రతినిధులు

ఖమ్మం/ వైరా టౌన్ అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

వైరా: వైరా పట్టణంలోని హనుమాన్ బజార్‌లో కొలువుదీరిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ , సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ విచ్చేశారు.ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం అమ్మవారి ఊరేగింపులో పాల్గొని, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మను ఎత్తుకొని ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, ధర్నా రాజశేఖర్, ఒకటో వార్డు కౌన్సిలర్ మోర్ శ్రీకాంత్, ఆలయ చైర్మన్ వేముల నాగరాజు, పల్లపు కొండలు, చిన్న రాములు, వల్లేపు రాము తదితరులు పాల్గొన్నారు.





యాసంగి పంటల సాగులో వరి మొక్కజొన్న బదులు అపరాల సాగు చేయాలి

ఖమ్మం/ వైరా అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

వైరా లోని రైతు వేదిక నందు కేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పిడి సరిత మాట్లాడుతూ రైతులకు ఏనీనో పై అవగాహన కల్పించారు యాసంగి పంటల సాగులో వరి మొక్కజొన్న బదులుగా అపరాల సాగు చేయాలని సూచించారు నీటి లభ్యత చాలా తక్కువగా ఉన్నందున రైతులు పెసర మినుము లాంటి పంటను సాగు చేయాలని తెలియజేశారు డి ఎం ఓ పత్తి కొనుగోలు పై వివరించారు అనంతరంవ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు రైతులతో కేత్ బచావో అభియాన్ వీడియో కాన్ఫరెన్స్ లో రైతులకు కొన్ని సూచనలు చేశారు.రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని మట్టి నమూనా భూసార పరీక్షలు తప్పక చేయించుకోవాలని రైతులకు సూచించారు ఈ కార్యక్రమంలో కొంతమంది రైతులు కొన్ని సూచనలు అందించారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొళ్ల గంగారావు మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజు ఖాన్ పీడీ ఆత్మ సరిత డి ఎం ఓ సంతోష్ కుమార్ ఏ డి ఏ తుమ్మల కరుణశ్రీ ఏపీ ఎఫ్ టి సి అరుణ జ్యోతి ఏవో ఎస్ టి ఎల్ జాల ప్రకాష్ రామారావు కె.వి.కె సైంటిస్ట్ పణి శ్రీ ఏ ఈ ఓ కీర్తి రైతు సంఘం నాయకులు బొంతు రాంబాబు చప్పిడి వెంకటేశ్వర్లు జవాజి వెంకటేశ్వరరావు గొల్లపూడి కృష్ణమూర్తి రైతులు తదితరులు పాల్గొన్నారు



కోదండ రామాలయానికి గ్రంథాలయం స్థలం కేటాయించాలి..

వైరా ఆర్యవైశ్యులు మణికంఠ భక్త బృందం..

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు న్యూస్ సత్యనారాయణ గౌడ్ కు వినతి పత్రం ..

ఖమ్మం/ వైరా టౌన్ అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

వైరాలోని ప్రస్తుత గ్రంథాలయం శిథిలావస్థ కావడంతో దానిని కాలేజీలోని విద్యార్థిని విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా కాలేజీలోని స్థలానికి మార్పు చేయాలని కోరుతూ వైరా ఆర్యవైశ్య ప్రముఖులు రంగా జనార్దన్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఖమ్మం జిల్లా ఇంచార్జి గ్రంధి ప్రవీణ్ నేతృత్వంలో పలువురు ఆర్యవైశ్యులు మరియు సాయి మణికంఠ బృందం రామాలయ భక్త బృందం సభ్యులు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ను కలిసి శిధిలావస్థలో ఉన్న గ్రంథాలయ స్థలాన్ని పక్కనే ఉన్న శ్రీ కోదండ రామాలయం రోడ్డు విస్తరణ స్థలాన్ని కోల్పోయిందని , దేవాలయానికి వచ్చు భక్తుల రద్దీ పెరిగిందని అందుకు బదులుగా గ్రంథాలయ స్థలాన్ని అప్పగించాలని కోరారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల యొక్క విన్నపాన్ని త్వరలోనే పరిష్కరించే విధంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి విషయాన్ని తెలియజేసి త్వరితగతిన రామాలయానికి అప్పగించే విధంగా కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ ఆత్మకూరి శేషగిరిరావు, గజ్జల కృష్ణమూర్తి లోకా వేణు, తాటికొండ రాము, వాణి, పెనుగొండ ఉపేంద్రరావు, బోనాల వెంకటేశ్వరరావు, కొణతం రాజారావు చెరుకూరి వెంకటేశ్వరరావు, బజారయ్య, మైలవరపు శ్రీనివాసరావు, రమేష్, రంగ స్వర్ణ నూకల అన్నపూర్ణ,గజ్జల మణి కుటుంబ సభ్యులు, తాటిపల్లి శీను, కృష్ణకుమారి మాజేటి శివ నాగ సంధ్య, మిట్టపల్లి శ్రీనివాసరావు, అనుమోలు శ్రీనివాసరావు, ఉమా , గీత, నాళ్ళ మల్లేశ్వరి, తదితర ఆర్యవైశ్యులు మణికంఠ భక్త బృందం సభ్యులు పాల్గొని వినతి పత్రాన్ని అందజేశారు



డాక్టర్ కాపా లోహితకు ఎం.ఎస్. పట్టా

వైరా వైద్య దంపతులు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ చంద్రకళ కుమార్తెకు పలువురు అభినందనలు..

ఖమ్మం/వైరా టౌన్ అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

వైరాకు చెందిన ప్రముఖ వైద్య దంపతులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, డాక్టర్ కాపా చంద్రకళ కుమార్తె డాక్టర్ కాపా లోహిత ప్రసూతి, స్త్రీల వ్యాధుల విభాగంలో శస్త్రచికిత్సా నిపుణతతో కూడిన మాస్టర్ ఆఫ్ సర్జరీ (ఎం.ఎస్.) పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పట్టాను గురువారం అందుకున్నారు. చెన్నైలోని శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ విశ్వవిద్యాలయం నుంచి ఆమె ఈ పట్టాను పొందారు.డాక్టర్ లోహిత ఎం.బి.బి.ఎస్. విద్యను పూర్తి చేసిన అనంతరం, మమత మెడికల్ కాలేజీలో తన వైద్య విద్యను కొనసాగించి, అనంతరం ఎం.ఎస్. పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోసం చెన్నైలోని శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లో చేరారు. అక్కడ ప్రసూతి, స్త్రీల వ్యాధుల విభాగంలో ఉన్నత వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి ఎం.ఎస్. పట్టాను సాధించారు.వైద్య వృత్తిలో ఉన్నత విద్యను అభ్యసించి, శస్త్రచికిత్సా విభాగంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పట్టాను సాధించిన డాక్టర్ లోహితను వైరా ప్రాంతానికి చెందిన వైద్యులు, ప్రముఖులు, కుటుంబసభ్యులు,శ్రేయోభిలాషులుఅభినందించారు. భవిష్యత్తులో వైద్య రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, ప్రజలకు విశిష్టమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా వైరా మండల డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ దారెల్లి కోటయ్య, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పెంట్యాల భాస్కరరావు, డాక్టర్ పెరుమాళ్ల కృష్ణమూర్తి, డాక్టర్ సతీష్ కుమార్, తమ్మిశెట్టిఅ ఉమామహేశ్వరరావు, డాక్టర్ దారెల్లి హరిత, డాక్టర్ లగడపాటి చరిత, డాక్టర్ శ్రీధర్ గౌడ్, లయన్ లగడపాటి ప్రభాకర్ రావు, ఉంద్రు శ్యాంబాబు, ఉంద్రు వరలక్ష్మి, చింతనిపు వెంకటయ్య, జాల పుల్లారావు, ఉయ్యూరు రామకృష్ణ, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్, పెనుగొండ ఉపేందర్ రావు, కొల్లా రాంబాబు, చెరుకూరు శ్రీనివాసరావు, షేక్ పాషా, కొదుమూరు రవి, ఏపూరి రాజారావు, గద్దె నీరజ, గజ్జల కృష్ణమూర్తి, చింతోజు నాగేశ్వరరావు, వై. బుచ్చి రామారావు, మరికంటి రాంగోపాల్, కన్యాదారి హనుమాయమ్మ, కుతుంబాక ఇంద్రాణి తదితరులు డాక్టర్ లోహితకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.



నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలి

జనగామజిల్లా/ రఘునాథపల్లి/(అక్షరం న్యూస్)అక్టోబరు 22:

కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నాలుగు లేబర్ కోడ్ను రద్దు చేయాలని, ప్రతి కార్మికుడికి నెలకు రూ.30 వేల కనీస వేతనం నిర్ణయించాలని సిఐటీయు జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ లోని ఇందిరా పార్కు వద్ద ఈ నెల 25, 26 తేదీలలో నిర్వహించనున్న మల్టిపుల్ డేస్ ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్ పోస్టర్లను మండల కేంద్రంలో సిఐటీయు నాయక లు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాపర్తి రాజు మాట్లాడుతూ ఇందిరా పార్కు వద్ద ఈ నెల 25, 26 తేదీలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు నిర్వహించే ధర్నాలో వివిధ రంగాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటీయు మండల కన్వీనర్ పొదల నాగరాజు, హమాలి యూనియన్ జిల్లా అధ్యక్షుడు బైరగోని బాలయ్య, ఉమ్మగోని రాజేష్, కడారి ఐలయ్య, అంజనేయులు, సత్యనారయణ, రాపోలు రాజ్కుమార్, తూడి ప్రభాకర్, నాగేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జూనియర్ బాలికల జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

ఖమ్మం: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న 48వ జూనియర్ బాలికల జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్--2026 పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా పోస్టర్ ను మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు భీమనాదుల అశోక్ రెడ్డి, సెక్రటరీ వరికూటి మోహన్, కోశాధికారి కోపిల తంబి, చీఫ్ ప్యాట్ర న్ వేముల ఆది, నాయకులు లింగాల రవికుమార్, కాంగ్రెస్ పార్టీ తిరుమలాయపాలెం మండల అధ్యక్షులు కొప్పుల అశోక్, నాయకులు యువ గోపి, సంఘం ప్రతినిధులు, క్రీడా నిర్వాహకులు,క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



బీసీలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి లోకేష్ యాదవ్ కు ఇవ్వాలి



నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి ...

లోకేష్ యాదవ్ కు ఎమ్మెల్సీ పదవి

ఉమ్మడి ఖమ్మం జిల్లా బిసి సంఘం తీర్మానం..

విలేకరుల సమావేశంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పాదిల సతీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి యలమందల జగదీష్

ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గవర్నర్ కోటాలో డాక్టర్ లోకేష్ యాదవ్ ఇవ్వాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పొదిల సతీష్ యాదవ్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి, నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఖమ్మం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం



లో వారు మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలోనూ , ఎన్ఎస్ యుఐ విద్యార్థి సంఘం నాయకుడు నుండి రాష్ట్ర అధికార ప్రతినిధి గా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పాటుపడిన లోకేష్ యాదవ్, నాయి బ్రాహ్మణ బిడ్డ జంపాల రాజేష్ లకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకపోతే తమ గోడు ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. 2014, 2018, 2023 ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, రాజ్యసభ, మంత్రి పదవి కూడా ఒక్క బీసీకి కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల జనాభా శాతం ఎక్కువగా ఉన్నా చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం కరువైందని పేర్కొన్నారు. ఓట్లు మావి సీట్లు మీవా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీసీలకు న్యాయం చేయాలని లేనిచో రాష్ట్రవ్యాప్తంగా బీసీల ఉద్యమానికి శ్రీకారం చుడతామని పేర్కొన్నారు. ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికలలో నాయి బ్రాహ్మణులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల వీరబాబు, పగడాల హనుమంతరావు, రాగం కోటి, నాగరాజు, వినయ్, వంశి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి .. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

ఖమ్మం/ వైరా టౌన్ అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

వైరా ఎమ్మెల్యే క్యా క్యాంపు కార్యాలయంలో నల్గొండ ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వైరాశాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ మండలాలను క్లస్టర్లుగా విభజించి, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పార్టీ నాయకులకు సూచించారు. ప్రతి మండలంలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారు ఓటరుగా నమోదు చేసుకునేలా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, మాజీ మంత్రి శ్రీ దామోదర్ రెడ్డి కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పార్టీకి వారు అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవకాశం కల్పించడం ఆనందదాయకమని పేర్కొన్నారు.సర్వోత్తమ్ రెడ్డి గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఓటరు నమోదు నుంచి ఎన్నికల కార్యాచరణ వరకు ప్రతి అంశాన్ని ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలనిసూచించారు.నియోజకవర్గంలోని ప్రతి మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతతో వ్యవహరిస్తూ, అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు అయ్యేలా కృషి చేయాలని కోరారు. పార్టీ శ్రేణులందరూ సమష్టిగా పనిచేసి ఎన్నికల ప్రక్రియలో చురుకైన పాత్ర పోషించాలని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జిగా వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సుడా చైర్మన్ శ్రీ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ టీపీసీసీ సభ్యులు వడ్డే నారాయణరావు, మార్క్ ఫెడ్ మాజీ వైస్



చైర్మన్ బొర్రా రాజశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, ఐదు మండల అధ్యక్షులు తోటకూర రాంబాబు, సవాళ్ల నాగేశ్వరరావు, స్వర్ణ శిరీష నరేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 20వ దళిత హక్కుల పోరాట సమితి పతాక ఆవిష్కరణ...

యామాల గోపాలరావు డీహెచ్పీఎస్ రాష్ట్ర కౌన్సిల్...

ఖమ్మం /వైరా అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

వైరా : దళిత హక్కుల పోరాట సమితి 20వ వసంతాల వేడుక పతాకావిష్కరణ వైరా నియోజకవర్గ కేంద్రంలో వైరా మహమ్మద్ రజబ్ అలీ కార్యాలయం నందు పతాకావిష్కరణ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ యామాల గోపాలరావు పతాకావిష్కరణ చేసినారు తరంతరం జరిగిన వార్షికోత్సవ సభలో డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి యంగల అనంతరావు పాల్గొని మాట్లాడుతూ నేటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో ఎన్నికల సమయంలో ప్రభుత్వాలు దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అలాగే చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను ఉద్దేశించి అంబేద్కర్ అభయ హస్తం కింద ఒక్కొక్క కుటుంబానికి 12 లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని అన్నారు. స్వాతంత్రం వచ్చి 78 79 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ దళిత వాడలు అట్టడుగునే ఉన్నాయి . ఎలాంటి అభివృద్ధికి నోచుకోకుండా ఇప్పటివరకు దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి . దళితులను కొన్ని కొన్ని చోట్ల దేవాలయాల్లోకి లోనికి కూడా రానివ్వకుండా కులాహంకార దోషములు చేస్తూనే ఉన్నారు. దళిత హక్కుల పోరాట సమితి ఆవిర్భవించి నేటికీ 19 సంవత్సరాలు పూర్తి చేసుకుని 20వ సంవత్సరములోనికి అడుగుపెట్టిన సందర్భంగా వైరా నియోజకవర్గ కేంద్రంలో పతాకావిష్కరణ జరగటం చాలా గర్వకారంగా ఉందని కొనియాడినారు . ఈ కార్యక్రమంలో డిఎస్పిఎస్ జిల్లా నాయకులు మాతంగి శ్రీనివాసరావు గారపాటి అశోక్,ఇనపనూరి తేలపుట్ల, రాంబాబు, ఇనుపనూరి శ్రీను,అప్పం సుధాకర్, కారుమంచి వేణు,మైఖేల్, ధారా వెంకటేశ్వర్లు,అమ్మడపూడి భూషణం,బాబు,ఎక్కిరాల బాబురావు, రాంబాబు,రామకృష్ణ, జానీ, తదితరులు పాల్గొన్నారు.



లోకేష్ యాదవ్ కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని డిమాండ్ చేసిన బీసీ సంఘం నాయకులు

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గవర్నర్ కోట ఎమ్మెల్సీ డాక్టర్ లోకేష్ యాదవ్ కు ఇవ్వాలని.. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏకగ్రీవ తీర్మానం.. బిసి నేతకు ఇవ్వకపోతే మరో ఉద్యమం ఖమ్మం నుండి ప్రారంభిస్తాం..

ఖమ్మం/ వైరా అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)



గత 26 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఎన్ ఎస్ యుఐ నుండి రాష్ట్ర అధికార ప్రతినిధి వరకు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పాటుపడి, జైలు జీవితం అనుభవించిన ఉద్యమనేత, ఉన్నత విద్యా వంతుడు, సమర్థుడు డాక్టర్ లోకేష్ యాదవ్ కు గవర్నర్ కోట ఎమ్మెల్సీ ఇవ్వడం వలన ఉమ్మడి ఖమ్మం జిల్లా బిసి కు కొంత వరకైనా న్యాయం జరుగుతుంది. 60 శాతం ఉన్న బీసీలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకపోతే మా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి??... 2014, 2018, 2023 సంవత్సరాలలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ , రాజ్యసభ, మంత్రి ఒక్క స్థానం కూడా కాంగ్రెస్ పార్టీ బీసీలకు కేటాయించలేదు.బిసి ల జనాభా ఎక్కువ..... చట్టసభల్లోబిసి ల ప్రాతినిధ్యం తక్కువ ..... ఓట్లు మావి ... సీట్లు మీకా.... ప్రజా ప్రభుత్వం అంటే జిల్లాలో బీసీలకు ప్రాతినిధ్యమే లేకుండా చేయడమా..??ఇదెక్కడి న్యాయం ఉమ్మడి ఖమ్మం జిల్లా రాతియుగంలో ఉన్నదా??జనాభా దామాషా ప్రకారం మీరెంతో... మీకంత వాటా అనే రాహుల్ గాంధీ నినాదం ఖమ్మం జిల్లాకు కాంగ్రెస్ కు వర్తించదా.కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లాబిసి లకు న్యాయం చేయాలి.. బీసీ సంఘాల హెచ్చరిక..... ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ న్యాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతాం.. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు : పొదిల సతీష్ యాదవ్, డిమాండ్..ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు బత్తుల వీరబాబు, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యలమందుల జగదీష్, యాదవ సంఘం జిల్లా నాయకులు సత్తి వెంకన్న యాదవ్, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పగడాల అనంత రాములు ముదిరాజ్, ముదిగొండ బీసీ సంఘం అధ్యక్షులు రామకోటి యాదవ్, విద్యార్థి సంఘం నాయకులు వినయ్, వంశీ, నాగరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రామగుండంలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలం హరీష్ రెడ్డి



జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: రామగుండంలో మూడేళ్ల పాలనలో అభివృద్ధి కంటే ప్రజా సమస్యలు, ఇళ్ల కూల్చివేతలు, బాధితుల ఆవేదనే ఎక్కువగా కనిపిస్తున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాల్ల హరీష్ రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. వైనమ్మ ఆలయాల కూల్చివేతలు, వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లపై విమర్శలు, దుర్గామాత విగ్రహాల నిమజ్జనానికి మురికికుంటలను సూచించారన్న వివాదం ప్రజల మనోభావాలను దెబ్బతీశాయని పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్ నిరసన తర్వాతే నిమజ్జన ఏర్పాట్లపై స్పందించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు.ప్రజలు ప్రశాంతంగా జీవించేలా, వ్యాపారులు స్వేచ్ఛగా తమ కార్యకలాపాలు నిర్వహించేలా పాలన సాగించాలని, బాధితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు సూచించారు. రామగుండం ప్రజలకు మాటల పాలన కాకుండా చేతల పాలన కావాలని హరీష్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం

జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: మిషన్ భగీరథ ముర్మూర్ పంప్‌హౌస్ వద్ద విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రామగుండం నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో నీటి సరఫరా షెడ్యూల్‌లో మార్పులు చేసినట్లు రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ తెలిపారు.ఈ రోజు నీటి సరఫరా జరగాల్సిన ప్రాంతాలకు రేపు, రేపు సరఫరా కావాల్సిన ప్రాంతాలకు ఆ మరుసటి రోజు నీటిని సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా నీటి సరఫరా ఒక రోజు ఆలస్యమవుతున్న నేపథ్యంలో ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.ప్రజలు అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ నగరపాలక సంస్థకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి ఛలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి

- అక్టోబర్ 25, 26 తేదీల్లో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా



జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని సీఐటీయూ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్. భిక్షపతి విమర్శించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.సీఐటీయూ ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో గురువారం రామగుండం అంబేద్కర్ చౌక్ వద్ద మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్. భిక్షపతి, సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం. రామాచారి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక చట్టాలు ట్రేడ్ యూనియన్ హక్కులకు, కార్మిక హక్కులకు భంగం కలిగించేలా ఉన్నాయని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాన్ని రూ. 42 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

గుర్తుతెలియని వ్యక్తుల చేతులలో విద్యుత్ స్తంభాలు ధ్వంసం



రామగిరి (పెద్దపల్లి జిల్లా) అక్టోబర్ 22 అక్షరం న్యూస్:

రామగిరి మండలంలోని వెలగల్పహాడ్ లో గత నాలుగు రోజుల క్రితం ఆదివారం రాత్రి 11 కెవి, 6 విద్యుత్ స్తంభాలు గుర్తుతెలియని వ్యక్తుల చేతులలో ధ్వంసం అయ్యాయి. ఎన్పీడీసీఎల్ అధికారులు, రైతులు తెలిపిన వివరాల ప్రకారం ధ్వంసం అయినా విద్యుత్ స్తంభాలను సోమవారం స్థానిక రైతులు గమనించి ఎన్పీడీసీఎల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్పీడీసీఎల్ అధికారులు అలాగే రైతులు, రామగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రామగిరి ఎస్సై తాడవేనా శ్రీనివాస్ ఫిర్యాదు తీసుకొని ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిసింది. విద్యుత్ స్తంభాల ధ్వంసం వెనక రాత్రి వచ్చే వేటగాళ్ల పనా లేక మరెవరి కుట్రైన ఉందా తెలియాల్సి ఉంది. అలాగే సమస్యను వీలైనంత తొందరగా పరిష్కరించి విద్యుత్తును పునరుద్ధరించాలని రైతులు కోరారు.

మురుగు నీటిలో అమ్మవార్ల నిమజ్జనం..

కాలేశ్వరం జలాలతో శుద్ధి చేసిన కందుల సంధ్యారాణి





జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : రామగుండం నియోజకవర్గంలో దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనానికి మురుగు, డ్రైనేజీ నీటితో నిండిన ప్రాంతాన్ని కేటాయించడంపై బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా నిమజ్జన ఏర్పాట్లు చేశారని విమర్శించారు. ఈ నేపథ్యంలో కాలేశ్వరం త్రివేణి సంగమం నుంచి పవిత్ర జలాలను తీసుకువచ్చి నిమజ్జన ప్రాంతాన్ని శుద్ధి చేయడంతో పాటు అమ్మవార్ల విగ్రహాలపై ఆ జలాలను చల్లి పూజలు నిర్వహించారు.నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు భక్తులు ఉపవాస దీక్షలు, పూజలు, హోమాలు, అన్నదానాలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ఆరాధిస్తారని సంధ్యారాణి పేర్కొన్నారు. అలాంటి అమ్మవార్ల విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు కనీస పరిశుభ్రత లేని ప్రాంతాన్ని కేటాయించడం బాధాకరమన్నారు. నిమజ్జన స్థలాన్ని పరిశీలించినప్పుడు అక్కడి నీరు కనీసం కాళ్లు కడుక్కోవడానికి కూడా పనికిరాని విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు పరిహారంగా కాలేశ్వరం నుంచి తెచ్చిన జలాలతో నిమజ్జన ప్రాంతాన్ని శుద్ధి చేసి, అమ్మవార్లకు జరిగిన అపచారానికి క్షమించాలని కోరుతూ గుంజీలు తీశారు.గతంలో వినాయక విగ్రహాల



నిమజ్జనానికి సరైన నీటి సదుపాయం లేక ఇసుకలో నిమజ్జనం చేయాల్సి వచ్చిందని, బతుకమ్మ పండుగ సమయంలోనూ అపరిశుభ్రమైన నీటిలో నిమజ్జనాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆమె గుర్తుచేశారు. ప్రతి పండుగకు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసి, పరిశుభ్రమైన నీటి వసతులు కల్పించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.ఈ ఘటనకు బాధ్యులైన ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులు హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని సంధ్యారాణి డిమాండ్ చేశారు. భవిష్యత్తులో వినాయక, బతుకమ్మ, దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనాలకు ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వతంగా పరిశుభ్రమైన నిమజ్జన వేదికను ఏర్పాటు చేయాలని కోరారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ తగిన నీటి వసతులు, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ, కోడూరు రమేష్, అయోధ్య తిరుపతి, జక్కుల పద్మ, బియ్యాల మహేందర్, అంకార్ భరత్, పాకాల నరసింహారెడ్డి, జక్కన బాలు, బూడిద హర్ష, సాతిరి గంగరాజు, హనుమాన్ల వెంకటేష్, మీస వికాస్, శంకర్, శిలారపు కళ్యాణ్, ఎరుకొండ తిరుపతి, తరుణ్, అరవింద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి సహకరించాలి

- ఎన్టీపీసీ ఈడీ ఫైజ్ తయ్యబ్‌కు రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి

జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్టీపీసీ రామగుండం అభివృద్ధిలో ఎన్నో సంవత్సరాలపాటు విశేష సేవలందించి పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి యాజమాన్యం మరింత సహకారం అందించాలని ఎన్టీపీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రామగుండం ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫైజ్ తయ్యబ్‌ను కలిసి ఈ మేరకు పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లింది.ఎన్టీపీసీ రామగుండం విద్యుత్ ఉత్పత్తి కేంద్రం అభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగుల సేవలు ఎంతో విలువైనవని అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల రాంకిషన్, ప్రధాన కార్యదర్శి ముత్యాలు సత్తు పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధికి తమ జీవితంలోని విలువైన సంవత్సరాలను అంకితం చేసిన విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కూడా ఎన్టీపీసీ కుటుంబంలో అంతర్భాగమని తెలిపారు. నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు అసోసియేషన్ తరఫున స్వాగతం పలికారు.ఎన్టీపీసీ 50 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని గత నవంబర్ 7న సీఎండీ



విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం హైటీ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమాన్ని రామగుండం లోనూ నిర్వహించి పూర్వ ఉద్యోగుల మధ్య ఆత్మీయతను పెంపొందించాలని కోరారు.విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన వారికి సంస్థ సామాజిక బాధ్యత కార్యక్రమం ద్వారా హోమియోపతి మందుల సదుపాయం కల్పించే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రామగుండం ఎన్టీపీసీలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములు కుటుంబ అవసరాలు, చిన్నపాటి సమావేశాల కోసం నిర్దిష్ట కోటా లేదా మార్గదర్శకాల ప్రకారం వసతి సదుపాయాలను వినియోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు.విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన విజ్ఞప్తులను యాజమాన్యం సానుకూలంగా పరిశీలించి, సాధ్యమైన మేరకు తగిన నిర్ణయాలు తీసుకుంటుందని అసోసియేషన్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల రాంకిషన్, ప్రధాన కార్యదర్శి ముత్యాలు సత్తుతో పాటు రేవా సీనియర్ నాయకులు చెప్యాల శ్రీపతిరావు, తిరుమల సురేందర్, డాక్టర్ దుర్గం నర్సయ్య, మంగళంపల్లి రామనారాయణ, దేవా లాలయ్య, హర్కర వేణుగోపాల్ రెడ్డి, ఏడెల్లి వెంకటేశ్వర్లు, కొమ్ము గోపాల్, అంబటి సత్యనారాయణ, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

- విబిజి రామ్ జి సమీక్షలో ఎంపీడీఓ బద్రి శైలజ రాణి



రామగిరి (పెద్దపల్లి జిల్లా) అక్టోబర్ 22 అక్షరం న్యూస్:

ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని రామగిరి మండల ఎంపీడీవో బద్రి శైలజ రాణి అన్నారు. గురువారం వి బి జి రామ్ జి పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే వేసవికాలంలో ఎల్ నినో ప్రభావం ఎక్కువగా ఉంటుందని కాబట్టి ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకొని వాడుకున్న నీటిని ఇంకుడు గుంతలలోకి వెళ్లేటప్పుడు చూడాలని ఆమె అన్నారు. అదేవిధంగా రాబోయే కరువును ముందే పసిగట్టి జాగ్రత్తగా ఉండాలని ఇంటి స్థలాల పక్కనే కాకుండా వ్యవసాయ భూములలో కూడా ఫాం పాండ్స్ నిర్మించుకొని ఆ నీటిలో చేపలు అదేవిధంగా ఫాం పాండ్స్ చుట్టూ కూరగాయలు అంతర్ పంటలు కూడా వేసుకోవచ్చని ఆమె సూచించారు. అలాగే వికసిత్ భారత్ రామ్ జి లో పని కావలసిన జాబ్ కార్డులు ఉన్నవారికి 125 రోజులు పని కల్పిస్తామని కాబట్టి మండల రైతులు, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని రాబోయే కరువును ముందే పసిగట్టి ఎల్ నినో ప్రభావం పడకుండా చూసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఈసి వి మౌనిక, టిఏలు సుప్రియ, అఖిల, కంప్యూటర్ ఆపరేటర్ సత్యం, ఫీల్డ్ అసిస్టెంట్లు కన్నూరి రాజయ్య, పేరవేన కొమరయ్య, ముప్పిడి నాగేష్, ఎంజాల సతీష్, సందేవేన జ్యోతి, తోపాటు మేట్స్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా లోనే శ్రావణ్ కుమార్

- యువజన నాయకుడికి కీలక బాధ్యతలు.



జనగామ జిల్లా/రఘునాథపల్లి/(అక్షరం న్యూస్) సెప్టెంబర్ 02:

రఘునాథపల్లి మండల కాంగ్రెస్ పార్టీలో యువజన నాయకుడు లోనే శ్రావణ్ కుమార్ కు కీలక బాధ్యతలు అప్పగించారు. మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రకటించారు. బుధవారం రఘునాథపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో నూతన మండల కమిటీలను ప్రకటించారు, కన్నాయపల్లి గ్రామానికి చెందిన యువజన నాయకుడు లోనే శ్రావణ్ కుమార్‌ను మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించారుఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు లకావత్ ధనవంతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చందర్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు

రెండవసారి బిజెపి జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ



చొప్పదండి /కరీంనగర్, అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

రెండవసారి బిజెపి జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ గా నియామకం అయినారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి, తన కృషిని గుర్తించి మరోసారి భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా సేవ చేసే అవకాశం కల్పించిన కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కి, బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశంకి హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చేపూరి సత్యం అన్నారు. ఈ బాధ్యత తనకు దక్కిన గౌరవంగా మాత్రమే కాకుండా, పార్టీ అభివృద్ధికి మరింత కష్టపడి పనిచేయాల్సిన గురుతర బాధ్యతగా భావిస్తున్నాను. మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, ప్రజాసేవే లక్ష్యంగా అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇస్తున్నాను.పార్టీ బలోపేతమే లక్ష్యం... ప్రజాసేవే పరమావధి... నాయకుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే నా కర్తవ్యము అని ఆయన అన్నారు.

పేదల పక్షాన నిలిచి పోరాడిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న.... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- కలెక్టరేట్‌లో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు..



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

పేద ప్రజల పక్షాన నిలిచి, అణగారిన వర్గాల కోసం పోరాడిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న అని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.గురువారం పండుగ సాయన్న జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో వారి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.జిల్లాకలెక్టర్ దివాకర టి ఎస్ మాట్లాడుతూ.. ప్రజలను దోపిడీ చేస్తున్న భూస్వాములకు, దొరలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న పోరాటం చేశారని తెలిపారు. పండుగ సాయన్న కేవలం సంపన్నుల నుంచి ఆస్తులను తీసుకొని పేదలకు పంచి పెట్టడానికే పరిమితం కాకుండా, ఆనాటి పాలనలోని అధికార వ్యవస్థను ప్రశ్నించి, అధికారులను ఎదిరించారని తెలిపారు. తనదైన పాలనా వ్యవస్థను ఏర్పాటు చేసుకొని, సమాజంలో అణగారిన వర్గాలకు న్యాయం జరిగేలా ప్రయత్నించారని వివరించారు. ప్రజల కోసం పోరాడిన పండుగ సాయన్న జీవితం, ధైర్యసాహసాలు తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల కోసం పోరాడిన మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, అధికారులు, కుల సంఘ నాయకులు ములకలపల్లి సంగమేశ్వర రావు, పిట్టల వెంకట నరసయ్య, రావుల హనుమంతరావు, అనంత రాములు, బైరు హరినాథ బాబు, లింగబోయిన లక్ష్మణ్, పిట్టల నాగేశ్వరరావు ముదిరాజ్, గోల్కొండ అంజయ్య, కొప్పెర జానకి రామయ్య, పొన్నెబొయిన స్వామి, సుంకర శ్రీనివాసరావు, నార్ల శేషయ్య, మామిడి వెంకటేశ్వర్లు, మేడారం వెంకటేశ్వర్లు, కొప్పెర ఉపేందర్, పొడగంటి రాంబాబు, మేకల సుగుణరావు, భద్ర నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పండుగ సాయన్న 174 వ జయంతి వేడుకలు



మంచిర్యాల జిల్లా/ మందమర్రి, అక్టోబర్ 22/ అక్షరం న్యూస్ –:

తెలంగాణ రాబిన్ హుడ్ పండుగ సాయన్న 174 వ జయంతిని గురువారం మందమర్రి పట్టణ ముదిరాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి పట్టణ అధ్యక్షులు నెల్లి రాజలింగం ప్రధాన కార్యదర్శి కట్ల శ్రీనివాస్, అనవేన శంకర్, ముల్కలపల్లి వెంకటేశ్వర్లు, పిడుగు రాజేందర్, కుంభం రాజేందర్, పోలు సంపత్, కందుల ఓదెలు, నూకపోతుల శ్రీనివాస్, పోలు కుమారస్వామి, రెడ్డి సతీష్, మస్కం సతీష్, గనవేన స్వామి, పోతరవేన కుమార్, తొగరి కుమార్, ఈరవేన మల్లేష్, పల్లె మొగిలి, కలవేన విశ్వనాథ్, చిలక ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి కోసం స్పష్టమైన లక్ష్యాలతో పనిచేయాలి...

- జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్
- ఆరు నెలల్లో స్వల్పకాలిక లక్ష్యాలు 100 శాతం పూర్తి చేయాలి..
- విద్య, వైద్యం, నైపుణ్య శిక్షణ, పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి..
- మిర్చి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెంచాలి..
- అన్ని శాఖల అభివృద్ధి ప్రణాళికలను పరిశీలించి పలు సూచనలు చేసిన కలెక్టర్..

ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

జిల్లా అభివృద్ధి కోసం అన్ని శాఖలు స్పష్టమైన లక్ష్యాలతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర

టి ఎస్ అధికారులను ఆదేశించారు.

గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి సంబంధిత శాఖల అధికారులు ఇప్పటికే రూపొందించిన

జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ ప్రణాళికలను వివరించగా, వాటిని పరిశీలించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ మాట్లాడుతూ ప్రతి శాఖ స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకోవాలని తెలిపారు. స్వల్పకాలిక లక్ష్యాలను ఆరు నెలల్లోగా వంద శాతం సాధించేలా, మధ్యకాలిక లక్ష్యాలను ఆరు నుంచి పన్నెండు నెలల్లో, దీర్ఘకాలిక లక్ష్యాలను పన్నెండు నుంచి ఇరవై నాలుగు నెలల్లో సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి నెలా లక్ష్యాల సాధనలో పురోగతిని సమీక్షించాలని, నిర్దేశిత నమూనాలో పూర్తి వివరాలతో ప్రణాళికలను సవరించి తిరిగి సమర్పించాలని ఆదేశించారు.అత్యంత ముఖ్యమైన పనులను వెంటనే చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖల ప్రణాళికలకు ప్రాథమిక కార్యాచరణ నమూనా సిద్ధమైన తర్వాత ప్రతి రంగానికి అవసరమైన కన్సల్టెన్సీ సేవలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

వైద్య సేవలు మెరుగుపడాలి:

జిల్లాలో శిశు మరణాల రేటు (ఐఎం ఆర్), మాతృ మరణాల రేటు (వీవీ=) తగ్గించేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. గర్భిణుల నమోదు వంద శాతం పూర్తి చేయడంతో పాటు ప్రసవాల వివరాలు, గర్భిణుల ఆరోగ్య పరిస్థితి, టీకాల కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.వైద్య సేవల మెరుగుదలకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇప్పటికే అమలులో ఉన్న విధానాలను క్షేత్రస్థాయిలో ఎలా పర్యవేక్షిస్తున్నారో నిర్దేశిత నమూనాలో వివరాలు సమర్పించాలని తెలిపారు. సిజేరియన్ ప్రసవాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని సూచించారు.పిల్లల్లో తీవ్రమైన పోషకాహార లోపం, మధ్యస్థ పోషకాహార లోపం తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ముఖ్యంగా అటవీ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో పిల్లల్లో పోషకాహార లోపానికి గల కారణాలను గుర్తించి, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన ప్రతి అంశంపై లక్ష్యాలు, అమలు విధానం, పర్యవేక్షణ వివరాలను నిర్దేశిత నమూనాలో సమర్పించాలని ఆదేశించారు.



పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి:

ప్రతి పాఠశాల ప్రస్తుత రేటింగ్‌ను పరిగణనలోకి తీసుకొని విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతను మెరుగుపరచాలని తెలిపారు. పాఠశాలల వారీగా సాధించాల్సిన లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించి, వాటి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు పెంచాలి:యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్ యూనివర్సిటీ, వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పరిశ్రమలు, మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న నైపుణ్యాల డిమాండ్‌కు అనుగుణంగా శిక్షణ కోర్సులు రూపొందించాలని సూచించారు.నైపుణ్య శిక్షణ కార్యక్రమాల్లో ఎక్కువ మంది యువత పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, శిక్షణ పొందుతున్న యువత వివరాలు, శిక్షణ పురోగతి, సాధించిన ఫలితాలపై ప్రత్యేక రికార్డు నిర్వహించాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వసతి విద్యాసంస్థల్లో త్రాగునీటి పరిస్థితిపై వారంలో నివేదిక ఇవ్వాలి:

జిల్లాలోని అన్ని వసతి విద్యాసంస్థల్లో త్రాగునీటి సదుపాయాల పరిస్థితిని వచ్చే వారం రోజుల్లోగా సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు సురక్షితమైన త్రాగునీరు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పరిశ్రమలు, మిర్చి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి:

జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులు, ఉత్పత్తులు, పారిశ్రామిక అవకాశాలను పరిగణనలోకి తీసుకొని పరిశ్రమల అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ తెలిపారు.

పెద్ద, మెగా పరిశ్రమల స్థాపనకు అవకాశాలను గుర్తించడంతో పాటు చిన్న, మధ్య తరహా పరిశ్రమల పరిధిలో వ్యవసాయ ఆధారిత ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు.జిల్లాలో మిర్చి ఉత్పత్తి అధికంగా ఉన్నప్పటికీ, దానికి అనుగుణంగా ప్రాసెసింగ్ యూనిట్లు తక్కువగా ఉన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మిర్చి ప్రాసెసింగ్‌తో పాటు ఇతర వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ప్రతిపాదిత ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఎంతమందికి ఉపాధి లభిస్తుంది, ఎంత ఆర్థిక విలువ సృష్టించ వచ్చు అనే వివరాలతో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలు సమర్పించాలని ఆదేశించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఆన్‌లైన్ సేవలు పెంచాలి:

ప్రభుత్వ కార్యాలయాల్లో హాజరు సహా సంబంధిత పరిపాలనా ప్రక్రియలను ఆన్‌లైన్‌లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వివిధ శాఖల పనితీరు, లక్ష్యాల సాధన, సేవల పురోగతిని సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు డ్యాష్‌బోర్డు అభివృద్ధి చేయాలని తెలిపారు. దీనికి అవసరమైన సమాచారాన్ని ముందుగానే గుర్తించి, సంబంధిత శాఖల నుంచి వివరాల సేకరణకు తగిన విధానం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పట్టణ ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాల పనితీరు మెరుగుపరచడంతో పాటు త్రాగునీటి సరఫరా, ఫుట్‌పాత్‌లు, పారిశుధ్య సదుపాయాలను మెరుగు పరచాలని కలెక్టర్ తెలిపారు. పట్టణాల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని సమగ్ర పట్టణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.జనాభా పెరుగుదల, పట్టణాలు, నగరాల విస్తరణ, కొత్త కాలనీల ఏర్పాటు, భవన నిర్మాణాల అవసరాలను ముందుగానే అంచనా వేసి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేపట్టాలని ఆదేశించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌళిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా అందించాలి:

ప్రతి ప్రభుత్వ కార్యాలయం నుంచి ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించాలని కలెక్టర్ సూచించారు. వివిధ సేవల కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తగ్గించి, సేవలను వేగంగా అందించేందుకు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి సేవకు సంబంధించి తీసుకునే సమయం, సేవల పంపిణీలో మెరుగుదల వంటి అంశాలపై స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సూచించారు.అన్ని శాఖలు తమ ప్రణాళికలను సూచనలకు అనుగుణంగా సవరించి, నిర్దేశిత నమూనాలో తిరిగి సమర్పించాలని ఆదేశించారు. ప్రతి నెలా లక్ష్యాల సాధనను సమీక్షిస్తూ, జిల్లా అభివృద్ధి ప్రణాళికలను ఫలితాల ఆధారంగా ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, సిపిఓ శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెట్టి చాకిరి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి...

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- వెట్టి చాకిరి నిర్మూలనపై వాల్ పోస్టర్ ఆవిష్కరణ.
- ఖమ్మం కలెక్టరేట్ నందు అసంఘటిత రంగ కార్మికులకు అవగాహన కల్పించే ప్రచార రథం జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్..



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

సమాజంలో అనాదిగా కొనసాగుతున్న వెట్టి చాకిరి, బానిసత్వం వంటి దురాచారాలను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ పిలుపునిచ్చారు. వెట్టి చాకిరి నిర్మూలనపై కార్మిక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్‌ను గురువారం ఖమ్మం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం అసంఘటిత రంగ కార్మికులకు వెట్టి చాకిరి నిర్మూలన, కార్మిక హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, వెట్టి చాకిరి అనేది మానవ హక్కులకు, వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించే అమానవీయ విధానమని, సమాజంలో ప్రతి ఒక్కరికీ గౌరవప్రదంగా జీవించే హక్కు ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్మికులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా బలవంతంగా పనులు చేయించడం, శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వకుండా పనిచేయించుకోవడం వంటి అన్యాయాలకు పాల్పడితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వెట్టి చాకిరి నిర్మూలనకు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రచార కార్యక్రమం ద్వారా అసంఘటిత రంగ కార్మికులకు వెట్టి చాకిరి నిర్మూలన, కార్మికుల హక్కులు, అందుబాటులో ఉన్న చట్టపరమైన రక్షణలు, ఫిర్యాదుల పరిష్కార విధానాలపై అవగాహన కల్పించనున్నారు. ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలతో పాటు వెట్టిచాకిరీ చోటుచేసుకునే అవకాశం ఉన్న ఇతర పని ప్రదేశాల్లోని అసంఘటిత, ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మికరంగాలపై ఈ ప్రచారం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందని, సమాజంలో వెట్టి చాకిరికి తావులేకుండా, ప్రతి కార్మికుడు స్వేచ్ఛగా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎం. కోటేశ్వరులు, జిల్లా కార్మిక శాఖ సహాయ కమీషనర్ పి. కృష్ణవేణి, సహాయ కార్మిక అధికారి ఓ. రమేష్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ భాస్కర్, జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యులు లక్ష్మయ్య, ఎఐడి ఎన్జీఓ శ్రీనివాస్, గజ్వేల్ కళాబృందానికి చెందిన వంశీ, రాధా, ప్రతాప్, వేణు, లత, సునీల్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ వివక్షపై భగ్గుమన్న విపక్షం..

- ప్రజా పాలన కాదిది కాంగ్రెస్ పాలనే..
- కండువ కప్పుకుంటేనే అర్హుడా...?
- రాజకీయ వివక్షను మానుకోండి..
- గ్రామ కమిటీల రద్దుకు వామపక్ష, బిఆర్ఎస్ నాయకుల డిమాండ్..
- ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా, ఆందోళన..
- కలెక్టరు వినతి..

ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 22(అక్షరం న్యూస్)

ఖమ్మం : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వం చూపెడుతున్న రాజకీయ వివక్షపై విపక్షాలు భగ్గుమన్నాయి.వామపక్షాలు బిఆర్ఎస్ నేతృత్వంలో గురువారం భారీ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించాయి.ఈ సందర్భంగా ధర్నాచౌక్లో ఎంఎల్సీ తాతా మధు అధ్యక్షతన ఆందోళన కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు మాట్లాడుతూ,రాజకీయ వివక్షను మానుకోకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని అసలైన అర్హులకు ఇండ్లు దక్కే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ఇందిరమ్మ గ్రామ కమిటీలను తక్షణం రద్దు చేయాలని లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.సిపిఐ, సిపిఎం,బిఆర్ఎస్,సిపిఐ (ఎంఎల్) మాస్లైన్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తదితర పార్టీల నేతృత్వంలో ఖమ్మం ధర్నాచౌక్లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి వివిధ పక్షాల నాయకులు మాట్లాడుతూ,అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు దక్కడం లేదని ఎల్1, ఎల్2, ఎల్మ తో పాటు ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి అధికార పార్టీ కార్యకర్తలకు ఇండ్లు కట్టబెడుతున్నారన్నారు.రాష్ట్ర మంత్రులు ఇందిరమ్మ ఇండ్లలో ఎటువంటి వివక్ష లేదని అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెబుతున్న మాటలకు గ్రామాల్లో జరుగుతున్న పరిణామాలకు పొంతన లేదన్నారు. ఆచరణలో తద్విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అధికార యంత్రాంగం సైతం అధికార పార్టీకి దాసోహం అంటూ క్యాంపు కార్యాలయాల్లో లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి ఖర్చు చేస్తున్న సొమ్ము కాంగ్రెస్ పార్టీదో, మంత్రులదో కాదని అది ప్రజా ధనమని ప్రజా ధనంపై అందరికీ హక్కు ఉంటుందని వారు స్పష్టం చేశారు.రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 73, 74 –రాజ్యాంగ సవరణ చేశారని దానిని కూడా కాంగ్రెస్ పార్టీ తుంగలో తొక్కి సర్పంచులకు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో కనీస ప్రమేయం లేకుండా చేస్తుందని నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ వారే పన్ను కడుతున్నారా ఇతరులు పన్ను కట్టడం లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కండువ కప్పుకుంటేనే ఇండ్లు ఇస్తామన్నది సమాంజసం కాదని పద్ధతి మార్చుకోకపోతే పతనం –తప్పదని హెచ్చరించారు. పేదలందరికీ ఇండ్లు ఇవ్వాల్సిన ప్రభుత్వం రాజకీయ వివక్షకు తావిచ్చి కాంగ్రెస్సేతర రాజకీయ పక్షాలలో ఉన్న వారికి ఇండ్లు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని బోనకల్లు,కల్లూరు మండలం మర్లపాడులో ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు నిదర్శనమన్నారు.గతంలో పేదలను గుర్తించి లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసే –వారని కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం తీరు మార్చుకుని తక్షణం ఇందిరమ్మ గ్రామ కమిటీలను రద్దు చేసి అర్హులను గుర్తించి లాటరీ పద్ధతిలో లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ గేటు వద్ద దాదాపు గంట సేపు బైఠాయించారు. జిల్లా నలుమూలల నుంచి వామపక్షాలు, బిఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అనంతరం డిమాండ్తో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్కు అందజేయడంతో పాటు జిల్లాలో నెలకొన్న పరిస్థితిని అర్హులకు జరుగుతున్న అన్యాయాన్ని కలెక్టర్కు వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఎంఎల్సి తాతా మధు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్ఎలు సంద్ర –వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్రెడ్డి, బానోత్ చంద్రావతి, జెడ్పి మాజీ చైర్మన్ లింగాల కమల్యి రాజు,సిపిఐ(ఎంఎల్)మాస్లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బండారు ఐలయ్య,సిపిఐ(ఎంఎల్)చంద్ర సురేందర్ కల్లూరు మాజీ జెడ్పిటిసి కట్టా అజయ్ కుమార్ వివిధ పార్టీల నాయకులు మహ్మద్ మౌలానా, బెల్లం వేణుగోపాల్, బండి రమేష్, మాదినేని జితేందర్ రెడ్డి,యర్రాబాబు, ఎస్కి జానిమియా,ఏపూరి లతాదేవి,ఆవుల అశోక్, జి.రామయ్య, శిరోవ లక్ష్మి నారాయణ, యర్రా శ్రీనివాసరావు, పగడాల నాగరాజు, బొమ్మెర రామ్మూర్తి, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి..

- అర్హులైన పేదలకు న్యాయం చేయాలి..
- కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్, వామపక్ష పార్టీల మహాధర్నా.. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నేతల ఆగ్రహం..

ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 22(అక్షరం న్యూస్)

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన పేదలకు న్యాయం చేయాలని, లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీల ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు.ఈ మహాధర్నాకు ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అధ్యక్షత వహించగా ఈ సందర్భంగా బీఆర్ఎస్, వామపక్ష పార్టీల నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.కాంగ్రెస్ పార్టీలో చేరితే లేదా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుంటేనే సంక్షేమ పథకాలు అందుతాయన్న ధోరణితో అధికార పార్టీ వ్యవహరిస్తోందని నాయకులు విమర్శించారు. లిసంక్షేమ పథకాలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం సరికాదని, అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.గతంలో కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమ పథకాల అమలులో అన్ని వర్గాల అర్హులకు ప్రాధాన్యత కల్పించిందని నాయకులు గుర్తుచేశారు. గతంలో అనుసరించిన పారదర్శక విధానాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అమలు చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను తప్పనిసరిగా గ్రామసభల ద్వారానే చేపట్టాలని స్పష్టం చేశారు.

మహాధర్నాలో ప్రధాన డిమాండ్లు..

ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత లబ్ధిదారులను గ్రామసభల ద్వారానే ఎంపిక చేయాలి.

తక్షణమే ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలి..

గతంలో ఇందిరా ఆవాస్ యోజన, ఆర్సీహెచ్ పథకాల కింద మంజూరై, బిల్లులు అందక అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లకు వెంటనే బిల్లులు మంజూరు చేయాలి. మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన పెండింగ్ ఫైనల్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలి..

అర్హులైన పేదల వివరాలతో జిల్లా కలెక్టర్కు వినతిపత్రం..

మహాధర్నాలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులకు వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం వివిధ గ్రామాలు, మండలాల వారీగా అర్హులైనప్పటికీ ఇళ్లు మంజూరు కాని పేద లబ్ధిదారుల ఫొటోలు, వివరాలను సేకరించి ప్రదర్శించారు.ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అధ్యక్షతన బీఆర్ఎస్, వామపక్ష పార్టీల నాయకులు సంయుక్తంగా ర్యాలీగా జిల్లా కలెక్టరేట్కు చేరుకుని జిల్లా కలెక్టర్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామాల వారీగా అర్హులైన పేద లబ్ధిదారుల వివరాలను, వారి ఫొటోలతో సహా వినతిపత్రానికి జతచేసి అందజేశారు. అర్హత ఉన్నప్పటికీ ఇళ్లు మంజూరు కాని ప్రతి పేద కుటుంబానికి న్యాయం చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు.గ్రామపంచాయతీల్లో తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించి, ప్రజల సమక్షంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా నిజమైన నిరుపేదలకు ఇళ్లను మంజూరు చేయాలని, గతంలో ఇళ్లు మంజూరై బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులకు తక్షణమే న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ మహాధర్నాలో బీఆర్ఎస్, వామపక్ష పార్టీల నాయకులు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అర్హులైన ఇళ్ల లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఆటపాటల హోరు- బతుకమ్మల జోరు. పల్లె పల్లెలో పూల జాతర

- తల్లాడ మండలంలో బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి దయ నంద్



ఖమ్మం/తల్లాడ టౌన్ అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

బతుకమ్మ ముగింపు వేడుకలలో భాగంగా బుధవారం సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టరాగమయి దయానంద్ గారు తల్లాడ మండలంలో పర్యటించారు ఈ సందర్భంగా పలు గ్రామాలను బతుకమ్మ వేడుకలుగా పాల్గొన్నారు.

నారాయణ పురం గ్రామంలో..

తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గారు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తల్లాడ మండలం ఇంచార్జి ముదుముంతలా గంగరాజు హాజరైనారు ఈ సందర్భంగా మహిళలతో బతుకమ్మ వేడుకలల్లో పాల్గొన్నారు ఈ సందర్భంగా తల్లాడ మండల విచ్చేసిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్ కి మహిళలు యువకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు అనంతరం శాలువాలతో సన్మానించారు ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ ముఖ్య నాయకులు తల్లాడ మండలం ముఖ్య నాయకులు నారాయణపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు యువకులు చిన్నారుల పాల్గొన్నారు

రామానుజవరం లో..

శీలం నాగిరెడ్డి, అచ్చిరెడ్డి,రవి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ పాల్గొన్నారు మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో రామానుజ వరం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు పాల్గొన్నారు

లక్ష్మీపురం లో..

తల్లాడ మండలం లక్ష్మీపురం గ్రామంలో మాజీ సర్పంచ్ ఓబుల సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రాఘమయి దయానంద్ పాల్గొన్నారు అనంతరం మహిళలతో కలిసి బతకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ కి కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లు కార్యకర్తలు మహిళలు యువకులు పాల్గొన్నారు

చిన్నారులను ఆశీర్వదించిన మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు

- ఘనంగా చిన్నారుల నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుకలు...



ఖమ్మం/తల్లాడ అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

వెంకటాయపాలెం శ్రీ హరి హర ఫంక్షన్ హాల్ నందు గురువారం భవ్యశ్రీ, జస్వంత్ లకు జరిగిన నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుకలకు తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు హాజరై చిన్నారులను అక్షింతలు వేసి దీవించారు.ఈ కార్యక్రమం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య జరిగాయి.ఈ సందర్భంగా వారు. చిన్నారులను ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఎదిగి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అన్నారుగూడెం సర్పంచ్ గొడ్ల ప్రభాకర్,ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టర పడాల శ్రీనివాసరావు,గ్రామ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం..

- గుమ్మడిదల వెంకటనారాయణ
- మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్



ఖమ్మం/ వైరా అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)


వైరా మున్సిపాలిటీ పరిధిలో తొమ్మిదవ వార్డ్ నందు సీసీ రోడ్డు నిర్మాణం కోరుతూ ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కి సుమారు 6 లక్షల రూపాయల మంజూరు కోసం వినతిపత్రం ఇస్తున్న గుమ్మడిదల వెంకటనారాయణ మరియు మునిసిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ మున్సిపల్ ఏఈ శ్రీ మాన్య కు నిధులు మంజూరు కోసం ఎస్టిమేట్స్ తయారు చేయమని ఎమ్మెల్యేగా ఆదేశించారు

2050 నాటికి ప్రతి ముగ్గురు భారతీయుల్లో ఒకరికి ఊబకాయం.. చర్యలు తప్పనిసరి అంటున్న సంస్థలు..

ప్రపంచ ఆరోగ్యానికి పొంచి ఉన్న పెను ముప్పుల కంటే అధిక శరీర కొవ్వుతో కలిగే ఆరోగ్య నష్టాలను నివారించడం ద్వారా ఎక్కువ ప్రయోజనం పొందవచ్చని ది లాన్సెట్ కమిషన్ వెల్లడించింది. 204 దేశాలు, ప్రాంతాలకు సంబంధించిన ప్రమాద అంచనాలను ఇన్స్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యుయేషన్ (ఐహెచ్ఎంఈ) విశ్లేషణ ఆధారంగా ఈ కమిషన్ రూపొందించింది. మహమ్మారులు, వాతావరణ మార్పులు, యాంటీమైక్రోబియల్ ఔషధ నిరోధకత, అణు సంఘర్షణ వంటి విపత్కర ముప్పులను ఇందులో గుర్తించింది. అయితే, నివారించగల ఆరోగ్య నష్టాల పరంగా అధిక శరీర కొవ్వు సమస్య వీటన్నింటి కంటే ముందున్నట్లు నివేదిక పేర్కొంది. అయితే, ఈ నివేదికను ప్రభుత్వ విధాన ప్రాధాన్యాల స్థిరమైన ర్యాంకింగ్గా పరిగణించకూడదని లాన్సెట్ సంపాదకులు స్పష్టం చేశారు. వాషింగ్టన్ విశ్వవిద్యాలయానికి చెందిన కమిషన్ సహాధ్యక్షుడు క్రిస్టోఫర్ ముర్రే మాట్లాడుతూ, ముప్పులను ఎదుర్కొనేందుకు మానవాళికి ఇప్పటికీ చర్యలు తీసుకునే సామర్థ్యం ఉందనేదే ఈ నివేదికలోని ప్రధాన సందేశమని పేర్కొన్నారు.

మూడో వంతు మంది కి ఊబకాయం..

భారత్ విషయానికి వస్తే, గత కొన్నేళ్లుగా లాన్సెట్ ప్రచురించిన అధ్యయనాలు ఊబకాయం పెరుగుదల పై హెచ్చరిస్తున్నాయి. దేశంలోని వివిధ వయసుల వారిలో ఈ సమస్య వేగంగా పెరుగుతున్నట్లు ఆ అధ్యయనాలు వెల్లడించాయి. 2050 నాటికి భారతీయుల్లో దాదాపు మూడో వంతు మంది అధిక బరువు లేదా ఊబకాయంతో బాధపడే అవకాశం ఉందని అంచనా వేశాయి. ఇప్పటికే దేశంలో మధుమేహంతో బాధపడుతున్న వారి సంఖ్య 10 కోట్లకు పైగా ఉంది. ఈ పరిస్థితికి ఊబకాయం కూడా తోడవడంతో, మధుమేహం, ఊబకాయం కలిసిన డయాబెసిటీ తీవ్రమైన ప్రజారోగ్య సంక్షోభంగా మారుతోంది.



అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ళు మంజూరు చేయాలి.. .

- సర్పంచుల విధులు,అధికారాల వినియోగానికి అవకాశం కల్పించాలి...
- బిఆర్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద నిరసన...
- కార్యక్రమంలో పాల్గొన్న తల్లాడ మాజీ ఎంపీపీ, అన్నారుగూడెం సర్పంచ్ .



ఖమ్మం/తల్లాడ అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు,ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయాలని,గ్రామ పంచాయతీల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే సర్పంచులకు వారి విధులు, అధికారాలను వినియోగించుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఇల్లు లేని నిరుపేదలకు అర్హత ప్రాతిపదికన ఇళ్ల స్థలాలు మంజూరు చేసి,ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి వారికి న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న పేదల సమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో సర్పంచుల పాత్ర కీలకమని పేర్కొంటూ, వారికి కేటాయించిన విధులు, అధికారాలను స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల పరిపాలనలో సర్పంచులకు తగిన అధికారాలు,విధుల నిర్వహణకు అవసరమైన అవకాశాలు కల్పించాలని కోరారు.పేదలకు ఇళ్ల స్థలాల కల్పన,గ్రామ పంచాయతీల పరిపాలనలో సర్పంచుల అధికారాల వినియోగం వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులతో నిరసన తెలిపారు.ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

గ్రానైట్ అధ్యక్ష పదవి రేసులో షేక్. నజీర్ పాషా..

- యూనియన్ లో సుదీర్ఘ అనుభవం ఆయన సొంతం..
- అన్నారుగూడెంకు దక్కనున్న జిల్లా పదవి..



ఖమ్మం/తల్లాడ అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్ లో జిల్లా అధ్యక్ష పదవి రేసులో షేక్. నజీర్ పాషా ముందు వరసలో ఉన్నారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన ఆయన గత 25 ఏళ్లుగా గ్రానైట్ లో విధులు నిర్వహిస్తున్నారు. యూనియన్ లో అనేక పదవులను పొందిన ఆయన ఈసారి అధ్యక్ష పదవి కోసం పోటీపడుతున్నాడు. గ్రానైట్ లో సుదీర్ఘ అనుభవం కలిగిన నజీర్ ఈసారి గెలుపే ధ్యేయంగా తన వ్యూహాన్ని రచిస్తున్నారు. గ్రానైట్ లో, యూనియన్ లో అందరితో కలివిడితో ఉండే ఆయన గెలుపు నల్లేరుపై నడకల ఉందని పలువురు చర్చించుకోవడం విశేషం.

ముగ్గురు మధ్య పోటీ..

గ్రానైట్ మార్కర్ యూనియన్ అధ్యక్ష పదవి కోసం ముగ్గురు పోటీపడుతున్నారు. షేక్ నజీర్, వెంకటేష్, నునావత్ కిషన్ లు పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అందులో ప్రధమంగా నజీర్ పేరు వినబడుతుంది. ఈ పదవి రెండేళ్లపాటు కొనసాగుతోంది.

25 ఏళ్లుగా సుదీర్ఘ అనుభవం..

షేక్ నజీర్ పాషాకు 25 సంవత్సరాలుగా గ్రానైట్ లో పనిచేసిన అనుభవం ఉంది. లీజు ఫ్యాక్టరీ ఓనర్ గా, యూనియన్ వైస్ ప్రెసిడెంట్ గా విధులు నిర్వహించారు. ఖమ్మం మాజీ మేయర్ పునుకొల్లు నీరజ గ్రానైట్ కంపెనీలు విధులు నిర్వహిస్తున్నారు. 14 సంవత్సరాలుగా సుదీర్ఘంగా ఆమె గ్రానైట్లోనే నమ్మకంగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ముదిగొండ శ్రీదేవి గ్రానైట్ లో ఆయన విధులు నిర్వహిస్తూ పోటీకి సిద్ధమవుతున్నారు.

ఈసారి గెలుపు నాదే.. నజీర్

ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్ ఎన్నికల్లో ఈసారి తానే గెలుపొందుతానని షేక్. నజీర్ ధీమా వ్యక్తం చేశారు. అందరితో పరిచయాలు ఉన్న తనకు ఈసారి ప్రజలు పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. గెలిచిన అనంతరం యూనియన్ బలోపేతానికి, యూనియన్ లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. యూనియన్ సభ్యులు తనపై నమ్మకం ఉంచి ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు..

- కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు తెలుపుతూ బతుకమ్మలకు హోర్డింగులు..
- ఆకట్టుకున్న నల్ల చెరువు లోని
- బుద్ధుని విగ్రహం రెండు వైపులా బతకమ్మలు
- కుల మతాలకతీతంగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్న ఆడపడుచులు..
- మాజీ సర్పంచ్, మాజీ వైస్ ఎంపీపీ, శీలం కోటారెడ్డి శివపార్వతి దంపతులు ఆధ్వర్యంలో
- బతుకమ్మ వేడుకలు..



ఖమ్మం/ తల్లాడ అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

తల్లాడ మండలం రామానుజవరం గ్రామంలో బుధవారం రాత్రి బతుకమ్మ వేడుకలు మాజీ సర్పంచ్ ఉ వైస్ ఎంపీపీ దంపతులు శీలం కోటారెడ్డి శివపార్వతిల ఆధ్వర్యంలో తీరక్క పూలతో రంగురంగుల బతుకమ్మలను, వివిధ రూపాలలో ఏర్పాటు చేసిన బతుకమ్మల,గ్రామం మొత్తం ఇరువైపులా కాంగ్రెస్ జెండాల అలంకరణతో, కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను తెలిపే విధంగా బతుకమ్మకు ఫ్లకార్డులు తయారుచేసి ఏర్పాటుచేసి అలాగే ప్రత్యేక ఆకర్షణగా రామానుజవరం మండలం చెరువు మధ్యలో బుద్ధుని విగ్రహం దానికి ఇరువైపులా రెండు భారీ బతుకమ్మలతోలి విద్యుత్ దీపాలతో అలంకరణ చేసి, మండలంలోని ప్రత్యేకతను చాటుకున్నారు. గ్రామ మొత్తం బతకమ్మలతో కుల మతాలకతీతంగా ఆడబిడ్డలు ఆడి పాడి, బతుకమ్మ పండుగ అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు..ఈ సందర్భంగా దంపతులు మాట్లాడుతూ బతుకమ్మ ఆడపడుచులు చేసుకునే అతిపెద్ద పండుగగా ఆటపాటలతో డీజే నృత్యాలతో సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో, కులమతాలకు అతీతంగా పండగను జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు..అనంతరం కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ దంపతులను సన్మానించి, ప్రసాదం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ శీలం శివ పార్వతి, సర్పంచ్ కిన్నెర వెంకట కృష్ణవేణి, ఉపసర్పంచ్ కోడూరు సత్యనారాయణ వార్డు సభ్యులు, గ్రామస్తులు యువతీ యువకులు పాల్గొన్నారు..

మార్చి 2027 ఎస్ఎస్సీ పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల....

- వైరా ఎంఈఓ చావా శ్రీనివాసరావు



ఖమ్మం/వైరా అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

మార్చి--2027లో నిర్వహించనున్న ఎస్ఎస్సీ (10వ తరగతి), ఓఎస్ఎస్-సీ, ఒకేషనల్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ఫీజులను నిర్ణీత గడువులోగా చెల్లించాలని మండల విద్యాశాఖాధికారి చావా శ్రీనివాసరావు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం హైదరాబాద్ నుంచి ఆర్సీ నం.149/డీ-2/2026, తేదీ 22-10-2026 ద్వారా విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం పరీక్ష ఫీజుల చెల్లింపు తేదీలు, ఆలస్య రుసుముల వివరాలను వెల్లడించారు.

ఫీజు చెల్లింపు గడువులు ఇవే..

ఆలస్య రుసుము లేకుండా అక్టోబర్ 30 నుంచి నవంబర్ 16, 2026 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. రూ.50 ఆలస్య రుసుముతో నవంబర్ 18 నుంచి డిసెంబర్ 1 వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబర్ 3 నుంచి 14 వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబర్ 16 నుంచి 28 వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు.ప్రధానోపాధ్యాయులు సైట్ బ్రిడ్జి ద్వారా చెల్లించిన ఫీజుల వివరాలను పరిశీలించి, సంబంధిత చలానా తేదీలను కూడా నోటిఫికేషన్లో పేర్కొన్న గడువుల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల వివరాలను డీఈఓ కార్యాలయంలో ఆన్లైన్లో సమర్పించేందుకు డిసెంబర్ 21, డిసెంబర్ 7, డిసెంబర్ 17, డిసెంబర్ 30 తేదీలను ఆలస్య రుసుము కేటగిరీలను బట్టి నిర్ణయించారు.

పరీక్ష ఫీజుల వివరాలు

అన్ని సబ్జెక్టులకు పరీక్ష ఫీజు రూ.125గా నిర్ణయించారు. మూడు సబ్జెక్టుల వరకు రూ.110, మూడు సబ్జెక్టుల కంటే ఎక్కువ ఉంటే రూ.125 చెల్లించాల్సి ఉంటుంది. ఒకేషనల్ విద్యార్థులకు అదనంగా రూ.60 ఫీజు వర్తిస్తుంది.పరీక్ష ఫీజులను విద్యార్థులు నేరుగా చెల్లించకుండా, పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా నిర్ణీత విధానంలో చెల్లించాలి. ఫీజుల వివరాలను అధికారిక వెబ్సైట్లో పరిశీలించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు సూచనలు

ప్రధానోపాధ్యాయులు పరీక్ష ఫీజుల చెల్లింపు గడువులను విద్యార్థులకు తెలియజేయాలని, చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే ఫీజులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్ష ఫీజుల చెల్లింపు, నామినల్ రోల్స్ సమర్పణ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని కోరారు.

కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో...

తల్లాడలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

- కార్యక్రమంకు హాజరైన ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్.



ఖమ్మం/తల్లాడ అక్టోబర్ 20 (అక్షరం న్యూస్)

కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గొడుగునూరి లక్ష్మారెడ్డి,వేమిరెడ్డి కృష్ణారెడ్డి,పొట్టేటి జనార్దన్ రెడ్డి, వేమిరెడ్డి వెంకటనారాయణ రెడ్డి,దుండేటి వీరారెడ్డి నేతృత్వంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామంలో ఉన్న మహిళలంత ఒకచోట చేరి బతుకమ్మలాడి,బతుకమ్మలను ఎత్తుకొని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలతో డీజే పాటలతో కోలాట నృత్యాలతో మహిళలు,యువతీ యువకులు, చిన్నారులు కేరింతలతో బతుకమ్మ ఉత్సవాలను ఉత్సాహంగా ఉల్లాసంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు,మాజీ జెడ్పిటిసిలు కంచెపోగు వెంకటేశ్వర్లు,మూకర ప్రసాద్,నాయకులు తాళ్ల జోసెఫ్,తుమ్మలపల్లి రమేష్, గుడుగునూరి శ్రీనివాస్ రెడ్డి,బొడ్డు వెంకటేశ్వర్లు,జూనియర్ కే.వి,పొట్టేటి బ్రహ్మారెడ్డి,సారక్క రెడ్డి,లాయర్ బ్రహ్మారెడ్డి,కోడూరు రాము,నాగేశ్వరరావు, వేమిశెట్టి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల విద్యాప్రదాత ఎస్ఆర్ శంకరన్

గురుకుల విద్యా వ్యవస్థకు పునాది వేసిన దార్శనికుడు..

- ఉచిత విద్య, వసతి, సమాన అవకాశాల కల్పనలో ఎస్.ఆర్ శంకరన్ సేవలు చిరస్మరణీయం
- స్వేరోస్ జిల్లా అధ్యక్షులు కోండ్రు రామచంద్రు



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

పేద విద్యార్థుల విద్యాప్రదాత ఎస్.ఆర్ శంకరన్ అని, ఉచిత విద్య, వసతి, సమాన అవకాశాల కల్పనలో ఆయన సేవలు చిరస్మరణీయమని స్వేరోస్ జిల్లా అధ్యక్షులు కోండ్రు రామచంద్రు అన్నారు.ఖమ్మం నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద గురువారం ఎస్.ఆర్ శంకరన్ 92వ జయంతి, స్వేరోస్ డే లను పురస్కరించుకొని స్వేరోస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్.ఆర్ శంకరన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాం సుందర్ తో కలసి స్వేరోస్ జిల్లా అధ్యక్షులు కోండ్రు రామచంద్రు స్వేరోస్ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీనియర్ స్వేరోస్ నాయకులు మాట్లాడుతూ.. సమాజంలో పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదు.. కులం, ఆర్థిక స్థితిగతులు, సామాజిక వివక్ష పిల్లల భవిష్యత్తుకు అడ్డంకులు కావద్దు.. పేద కుటుంబాల్లో పుట్టిన పిల్లలు కూడా ఉన్నత విద్యను అభ్యసించి గౌరవప్రదమైన జీవితాన్ని సాధించాలనే ఆశయాలతో తన జీవితాన్ని సామాజిక సేవకు అంకితం చేసిన గొప్ప పరిపాలనా దార్శనికుడు డాక్టర్ ఎస్.ఆర్ శంకరన్ అని కొనియాడారు. ప్రభుత్వ పదవిని అధికార ప్రదర్శనకు కాకుండా అణగారిన వర్గాల అభ్యున్నతికి ఉపయోగించిన ఆయనను ప్రజలు ప్రేమతో 'పేదల ఐఏఎస్ అధికారి'గా గుర్తుచేసుకుంటున్నారన్నారు. డాక్టర్ ఎస్.ఆర్ శంకరన్ 1934 అక్టోబర్ 22న జన్మించారని అన్నారు. ఆయన 92వ జయంతి సందర్భంగా విద్య, సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కోసం చేసిన ఎస్.ఆర్ శంకరన్ సేవలను స్మరించుకోవడం సమాజానికి ఎంతో అవసరం అన్నారు. పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో చదివే స్థోమత లేక నాణ్యమైన విద్యకు దూరమవుతున్న పరిస్థితులను మార్చేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 1984లో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల అభివృద్ధికి శంకరన్ కృషి చేశారన్నారు. పేదల కన్నీళ్లు తుడవడమే నిజమైన ప్రజాసేవగా భావించిన ఎస్.ఆర్. శంకరన్ జీవితం.. విద్యను హక్కుగా చూడాలని, సంక్షేమాన్ని సామాజిక బాధ్యతగా అమలు చేయాలని నేటి సమాజానికి చాటి చెబుతోంది. ఈ కార్యక్రమంలో సీనియర్ స్వేరోస్ నాయకులు పోలేపొంగు ఆంజనేయులు, మోదుగు నాగేశ్వరావు, కలకోట సంపత్, పిడమర్తి వెంకటేశ్వర్లు, శీలం ప్రసాద్, మందుల వెంకన్న, బండ్ల నాగేశ్వరరావు, డాక్టర్ పిసి వీరస్వామి, వంగూరి దశరద్, మేకల భాస్కర్, మందుల రమేష్, అప్పారావు, గౌతమ్, చిట్టిబాబు, మహేష్, గద్దల నాగరాజు, గుజ్జు కృష్ణ, మోదుగు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తొలి సాయుధ విప్లవకారుడు పండుగ సాయన్న..



ఖమ్మం /స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 22 (అక్షరం న్యూస్)

కలెక్టరేట్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను డి.పి.ఓ. శ్రీమతి జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు . ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి పొడకంటి రాంబాబు మాట్లాడుతూ...భూస్వాముల దోపిడీ , అణచివేతకు వ్యతిరేకంగా పండుగ సాయన్న సాయుధ పోరాటం సాగించారని పేర్కొన్నారు . ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన సాయన్న పేద ప్రజల హక్కుల కోసం పోరాడి , సంపదను పేదలకు పంచిన గొప్ప విప్లవకారుడని కొనియాడారు . సమానత్వం కోసం ఆయన సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు . సాయన్న ఆశయ సాధనకు శ్రామిక, బహుజన వర్గాలన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు , వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొని పండుగ సాయన్న చిత్రపటానికి నివాళులర్పించారు .

స్త్రీల రాజ్యమేలుతున్న పెన్నురు గడ్డపై పవర్ వార్..

కీర్తి కీర్తి సురేష్ 'అక్క' ట్రైలర్ అదుర్స్!

ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ (చీవ్‌టశ్రీఅఇ) తెరకెక్కించిన క్రైమ్ డ్రామా సిరీస్ 'అక్క' (ూానిఝ) ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. నేషనల్ అవార్డు గ్రహీత కీర్తి సురేష్, టాలెంటెడ్ నటి రాధికా ఆప్టే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సిరీస్‌పై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. వైఆర్‌ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ (=ఖీ జుత్‌వత్ఝుఅఎవత్) నిర్మించిన ఈ సిరీస్‌కు ధర్మరాజ్ శెట్టి రచన, దర్శకత్వం వహించారు. పూర్తిగా మహిళల చేతుల్లో సాగే ఒక విభిన్న రాజ్యాన్ని, వారి మధ్య జరిగే పవర్ పాలిటిక్స్‌ను ఈ సిరీస్‌లో ఆవిష్కరించనున్నారు. అక్టోబర్ 30 నుంచి ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ట్రైలర్ చూస్తుంటే.. పెన్నురు (ూవతీఅబతీబ) అనే కల్పిత రాజ్యంలో గత 800 ఏళ్లుగా కేవలం మహిళలదే పూర్తి ఆధిపత్యం. ఇక్కడ కుటుంబాలు, వ్యాపారాలు అన్నీ మహిళల కంట్రోల్‌లోనే ఉంటాయి.



కుటుంబంలో అత్యున్నత అధికారం చెలాయించే మహిళను 'అక్క' అని పిలుస్తారు. ప్రేమకు, పెళ్లికి సంబంధించి ఈ సమాజం కొన్ని ప్రత్యేకమైన నిబంధనలను పాటిస్తుంది. అయితే, రుద్ర (రాధికా ఆప్టే) రాకతో ఈ వ్యవస్థలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుంటాయి. రుద్ర అంచనాలు, ఆమె ఆశయాలు భవాని (కీర్తి సురేష్)తో తీవ్ర ఘర్షణకు దారితీస్తాయి. ఈ ఇద్దరు బలమైన మహిళల మధ్య జరిగే ఆధిపత్య పోరు, వంశాచారాన్ని కాపాడుకునే ప్రయత్నం వంటి అంశాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఈ చిత్రంలో తన్వి అజ్మి, మహేష్ మంజ్రేకర్, అన్షుమన్ పుష్కర్, మోనికా పన్వార్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నెట్‌ఫ్లిక్స్, వైఆర్‌ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ క్రైమ్ డ్రామా అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.

పెళ్లిపీటలు ఎక్కబోతున్న 'హనుమాన్' హీరో తేజ సజ్జ..

ఉదయ్‌పూర్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్!




టాలీవుడ్ యంగ్ హీరో, 'హనుమాన్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న తేజ సజ్జ త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. ఈ వార్తను స్వయంగా ఆయనే ధృవీకరించారు. తన పెళ్లికి సంబంధించిన ఆసక్తికర విషయాలను అభిమానులతో పంచుకున్నారు. రాజస్థాన్‌లోని చారిత్రాత్మక నగరమైన ఉదయ్‌పూర్‌లో ఈ ఏడాది డిసెంబర్‌లో తన వివాహం అత్యంత నిరాడంబరంగా జరగనుందని తేజ సజ్జ వెల్లడించారు.

ఈ వివాహం పూర్తిగా పెద్దలు కుదిర్చిన వివాహం అని తేజ స్పష్టం చేశారు. తన తల్లిదండ్రులే ఈ సంబంధం నిశ్చయించారని తెలిపారు. డిసెంబర్‌లో జరగబోయే పెళ్లి వేడుకకు ముందు, నవంబర్ నెలలో నిశ్చితార్థ వేడుకను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తన వ్యక్తిగత జీవితాన్ని ఎప్పుడూ మీడియా కంటికి దూరంగా, అత్యంత గోప్యంగా ఉంచాలని కోరుకునే తేజ సజ్జ.. ఈ పెళ్లి వేడుకను కూడా కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలోనే జరపాలని నిర్ణయించుకున్నారు. ఉదయ్‌పూర్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్ ముగిసిన తర్వాత, హైదరాబాద్‌లో టాలీవుడ్ ప్రముఖులు, స్నేహితుల కోసం ప్రత్యేకంగా ఒక ఘనమైన రిసెప్షన్ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇక తన కాబోయే భార్య గురించి చెబుతూ.. ఆమెకు సినీ పరిశ్రమతో ఎలాంటి సంబంధం లేదని తేజ వెల్లడించారు. ఆమె కుటుంబం టెక్నాలజీ రంగంలో వ్యాపారం చేస్తోందని, ఆమె కూడా తన తండ్రితో కలిసి అదే రంగంలో పనిచేస్తున్నారని చెప్పారు. ఆమె అమెరికాలో పెరిగారని, సినిమా గ్లామర్ ప్రపంచానికి, లైమ్‌లైట్‌కు పూర్తిగా దూరంగా ఉన్నారని తెలిపారు. సెలబ్రిటీ ప్రపంచానికి దూరంగా ఉండే ఆమె స్వభావమే తనకు బాగా నచ్చిందని, భవిష్యత్తులో కూడా ఆమె ప్రైవసీకి ఎటువంటి భంగం కలగకుండా చూసుకుంటానని తేజ సజ్జ పేర్కొన్నారు.ప్రొఫెషనల్ లైఫ్ విషయానికి వస్తే.. 'హనుమాన్' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న తేజ సజ్జ, ఆ తర్వాత 'మిరాయ్' చిత్రంతో బ్లాక్ బస్టర్ అందుకున్నారు. ప్రస్తుతం ఆయన అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతున్న ప్రముఖ రియాలిటీ షో 'ది ట్రైటర్స్ తెలుగు' తొలి సీజన్‌కు హోస్ట్ వ్యవహరిస్తూ బిజీగా ఉన్నారు.

బిగ్‌బాస్‌లో షాలిని రీ ఎంట్రీతో రచ్చ..

డబుల్ ఎలిమినేషన్‌కు రంగం సిద్ధమైందా?



బిగ్‌బాస్ తెలుగు సీజన్ 10లో రోజురోజుకూ ఉత్కంఠ పెరుగుతోంది. 45వ రోజు హౌస్‌లో చోటుచేసుకున్న పరిణామాలు, కొత్త టాస్కులు, కంటెస్టెంట్ల మధ్య గొడవలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. ముఖ్యంగా షాలిని రీ ఎంట్రీతో హౌస్‌లో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. మరోవైపు, ఈ వారం ఏకంగా 12 మంది నామినేషన్లలో ఉండటంతో ఎలిమినేషన్‌పై చర్చ మొదలైంది. ఇద్దరు కంటెస్టెంట్లు హౌస్‌ను వీడబోతున్నారనే ప్రచారం కూడా జోరందుకుంది. హౌస్‌లోకి తిరిగి అడుగుపెట్టిన షాలిని తనదైన శైలిలో ఆటను మొదలుపెట్టింది. ఓ టాస్క్ సమయంలో దాక్షతో తీవ్రస్థాయిలో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఈ క్రమంలో ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ అభ్యంతరకరమైన పదాలు ఉపయోగించేందుకు ప్రయత్నించడంతో తోటి కంటెస్టెంట్లు ఆమెను వారించాల్సి వచ్చిందని తెలుస్తోంది.షాలిని రాకతో ఇప్పటికే ఉన్న సమీకరణాలు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇకపై హౌస్‌లో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో చూడాలి. కంటెస్టెంట్ల ప్రతిభతో పాటు ప్రేక్షకుల ఓటింగ్‌ను పరిగణనలోకి తీసుకుని బిగ్‌బాస్ హౌస్‌లో 'రెడ్, ఎల్లో, గ్రీన్' స్థాయులతో కూడిన ప్రత్యేక ఆటను ప్రవేశపెట్టినట్లు సమాచారం. ఇందులో భాగంగా రెడ్ స్థాయిలో ఉన్న సభ్యులను ఎల్లో స్థాయికి ప్రమోట్ చేసేందుకు కఠినమైన టాస్క్ నిర్వహించారు. సర్కిల్ మధ్యలో ఉన్న బోన్‌ను దక్కించుకునేందుకు ఝాన్సీ, సుధీర్, శ్వేత, రామ్ ప్రసాద్ తీవ్రంగా పోటీపడ్డారు. ఈ క్రమంలో పోటీ హోరాహోరీగా సాగింది. చివరకు ఫైనల్ రౌండ్‌లో రామ్ ప్రసాద్ విజయం సాధించి రెడ్ స్థాయి నుంచి ఎల్లో స్థాయికి ప్రమోట్ అయినట్లు తెలుస్తోంది. ఈ టాస్క్‌లో కంటెస్టెంట్లు చూపిన పట్టుదల ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది.ప్రస్తుతం బిగ్‌బాస్ హౌస్‌లో 17 మంది సభ్యులు ఉన్నట్లు సమాచారం. గ్రాండ్ ఫినాలే సమయానికి టాప్ 5 కంటెస్టెంట్లను మాత్రమే మిగల్చాలంటే రాబోయే వారాల్లో ఎలిమినేషన్ల వేగం పెరిగే అవకాశం ఉంది. ఈ వారం ఏకంగా 12 మంది నామినేషన్లలో ఉండటంతో డబుల్ ఎలిమినేషన్ ఉంటుందా? అనే ప్రశ్న ప్రేక్షకుల్లో మొదలైంది.అయితే, ఈ వారం ఇద్దరు కంటెస్టెంట్లు ఎలిమినేట్ అవుతారనే విషయంపై ఇప్పటివరకు అధికారిక స్పష్టత లేదు. డబుల్ ఎలిమినేషన్‌పై వస్తున్న వార్తలను కూడా ధ్రువీకరించాల్సి ఉంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఓటింగ్ ట్రెండ్స్ ప్రకారం వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇచ్చిన నీతు మాస్టర్, దాక్షి గట్టికొండ తక్కువ ఓట్లు సాధిస్తున్న కంటెస్టెంట్లలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో వారిద్దరి ఎలిమినేషన్‌పై చర్చ సాగుతోంది. అయితే, ఇవి అనధికారిక ఓటింగ్ అంచనాలు మాత్రమే. తుది ఫలితాలు బిగ్‌బాస్ నిర్వాహకుల అధికారిక ప్రకటన తర్వాతే స్పష్టమవుతుంది.

సామాజిక సందేశంతో 'జయహో రామానుజ'

స్వీయ దర్శకత్వంలో డా॥ సాయివెంకట్ నటించిన ఆధ్యాత్మిక చిత్రం 'జయహో రామానుజ'. సుదర్శనం ప్రొడక్షన్స్ పతాకంపై సాయిప్రసన్న, ప్రవల్లిక నిర్మించారు. జోశర్మ, సుమన్, ప్రవల్లిక కీలక పాత్రల్లో నటించారు. ఈ నెల 24న విడుదల కానుంది. బుధవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. దర్శకనిర్మాత, నటుడు సాయివెంకట్ మట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా మనుషులంతా ఒక్కటే అని చాటిన మహనీయుడు రామానుజాచార్యులని, ఈ పాత్ర వేషధారణలో ఇటీవల తాను తిరుమల వెళ్లినప్పుడు అక్కడ భక్తులు తనకు నమస్కరించడం జీవితంలో మర్చిపోలేని సంఘటన అన్నారు. సమసమాజ స్థాపన కోసం రామానుజాచార్యులు చేసిన ప్రయత్నాలు, ఈ క్రమంలో ఆయన ఎదుర్కొన్న కష్టాలను ఈ చిత్రంలో చూపించామని నిర్మాత ప్రవల్లిక పేర్కొన్నది.




చొక్కా నలగకుండా 500 కోట్లు కొట్టడం రజనీకే సాధ్యం..

'జైలర్ 2'పై అల్లు అర్జున్ ప్రశంసల జల్లు!



సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ 'జైలర్ 2' బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తుండగా, ఈ చిత్రంపై టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసల వర్షం కురిపించారు. సినిమా చూసిన ఆయన రజినీకాంత్ స్టైల్ పై ప్రశంసలు కురిపిస్తూ ఒక ప్రత్యేక పోస్ట్ పెట్టారు. "చొక్కా నలగకుండా 500 కోట్లు కొట్టడం ఒక్క రజినీ గారికే సాధ్యం" అంటూ అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.రజినీకాంత్ స్టార్ పవర్, ఆయన బాడీ లాంగ్వేజ్, స్వాగ్‌కు 'జైలర్ 2' ఒక నిజమైన నిదర్శనమని అల్లు అర్జున్ కొనియాడారు. ఈ సినిమా ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పించేలా అడ్రినలిన్ రష్ ఇచ్చే పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా నిలిచిందని ప్రశంసించారు. ఇక ఈ చిత్రానికి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించిన మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ తన మ్యాజిక్‌తో అదరగొట్టాడని, అనిరుధ్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాడని ప్రశంసించారు.దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తనదైన కూల్ శైలిలో మరో బ్లాక్‌బస్టర్‌ను అందించి బాక్సాఫీస్ వద్ద మరోసారి సంచలనం సృష్టించారని బన్నీ పేర్కొన్నారు. ఈ చిత్రంలో పని చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులు అలాగే ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ నిర్మాతలు తమ ప్రాణంగా పని చేసి ఈ విజయాన్ని సాధించారని అల్లు అర్జున్ అభినందించారు.

'రణబాలి' గ్రాండ్ సక్సెస్ ఈవెంట్‌కు ముహూర్తం ఫిక్స్.. ఎక్కడంటే?



టాలీవుడ్ రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్నా జంటగా నటించిన చిత్రం 'రణబాలి'. దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కించిన ఈ సినిమా దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. నిజ జీవిత సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం అభిమానులకు మరో ఆసక్తికరమైన వార్తను అందించింది. సినిమా విజయాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న గ్రాండ్ సక్సెస్ ఈవెంట్‌కు వేదిక, సమయాన్ని ఖరారు చేసింది.'రణబాలి' గ్రాండ్ సక్సెస్ ఈవెంట్‌ను అనంతపురం జిల్లాలోని రాప్తాడు సమీపంలో ఉన్న హార్మోని సిటీలో నిర్వహించనున్నారు. అక్టోబర్ 23న సాయంత్రం 5 గంటల నుంచి ఈ వేడుక ప్రారంభం కానుంది. ఈ మేరకు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. సినిమా విజయాన్ని అభిమానులతో కలిసి జరుపుకునేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా జంటగా నటించిన ఈ సినిమాపై విడుదలకు ముందు నుంచే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరిద్దరి జోడీకి ఉన్న క్రేజ్‌తో పాటు, దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ ఎంచుకున్న కథాంశం కూడా సినిమాపై ఆసక్తిని పెంచింది. దసరా సందర్భంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంటూ ముందుకు సాగుతోంది. సినిమా విజయోత్సవ వేడుకను అనంతపురంలో నిర్వహించనున్నట్లు ప్రకటించడంతో విజయ్ దేవరకొండ అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమానికి చిత్ర బృందం హాజరయ్యే అవకాశం ఉండటంతో వేడుకపై ఆసక్తి మరింత పెరిగింది. తమ అభిమాన హీరోను ప్రత్యక్షంగా చూసేందుకు అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ వేడుకలో చిత్ర విజయంపై నటీనటులు, దర్శకుడు ఎలాంటి విషయాలు పంచుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. 'రణబాలి' చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకులు అజయ్--అతుల్ సంగీతాన్ని అందించారు. మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా నటనతో పాటు దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కించిన కథనం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

226 కొట్టేశారు..

భారత్ రికార్డు ఛేజ్
తొలి టీ20లో కివీస్‌పై విజయం
శాంసన్, నమన్ మెరుపులు



క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్ గడ్డపై టీమిండియా పంజా విసిరింది. తొలి టీ20లోనే తమ బ్యాట్ పవర్ చూపెడుతూ.. రికార్డు ఛేజింగ్‌తో బెురా అనిపించింది. సంజూ శాంసన్ (33 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 67), నమన్ ధీర్ (15 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 42 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన తొలి పోరులో ఈ ఫార్మాట్‌లో తమ అత్యధిక పరుగుల లక్ష్య ఛేదనను నమోదు చేస్తూ.. 4 వికెట్లతో కివీస్‌పై ఘన విజయం సాధించింది.కివీస్ ఇచ్చిన 226 పరుగుల లక్ష్యాన్ని 6 వికెట్లు కోల్పోయి మరో రెండు బంతులు మిగిలుండగానే అందుకుంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (28 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 42) కూడా ఆకట్టుకున్నాడు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 20 ఓవర్లలో 225/6 భారీ స్కోరు సాధించింది. గ్లెన్ ఫిలిప్స్ (40 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 82 నాటౌట్), ఫిన్ అలెన్ (24 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 45) దంచికొట్టగా.. బెవాన్ జాకబ్స్ (31), డారిల్ మిచెల్ (28), సిఫర్ట్ (24) కూడా మెరిశారు. నాలుగేండ్ల తర్వాత బరిలోకి దిగిన సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ (0/49)తో పాటు బౌలర్లందరూ 40కి పైగా పరుగులు సమర్పించుకున్నారు. అర్ష్‌దీప్ (1/45), మయాంక్ యాదవ్ (1/40), అక్షర్ పటేల్ (1/51) తలో వికెట్ తీశారు. శాంసన్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. రెండో టీ20 శనివారం ఇదే వేదికపై జరగనుంది.

శాంసన్ ఆరంభం .. నమన్ ముగింపు

భారీ లక్ష్య ఛేదనలో భారత్‌కు ఓపెనర్లు శాంసన్, అభిషేక్(29) అద్భుత ఆరంభాన్ని అందించారు. అభి తన తొలి బంతికే సిక్సర్ బాదగా, శాంసన్ భారీ షాట్లతో బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఫెర్గూసన్ వేసిన రెండో ఓవర్లో సంజూ 4, 6,4 కొడితే.. మిల్నేను అభి 4, 4, 6,6తో దంచాడు. బ్రేస్‌వెల్ వేసిన ఆరో ఓవర్లో 6,4 కొట్టి 23 బంతుల్లోనే శాంసన్ అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. తర్వాతి బాల్‌కే అభి మిల్నేకు క్యాచ్ ఇవ్వడంతో పవర్‌ప్లేను భారత్ 94/1తో ముగించింది.అయితే, ఫీల్డింగ్ విస్తరించిన తర్వాత కివీస్ స్పిన్నర్లు బ్రేస్‌వెల్, శాంట్నర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి భారత్‌ను దెబ్బతీశారు. తన వరుస ఓవర్లలో శాంసన్, ఇషాన్ (1)ను శాంట్నర్ వెనక్కుపంపితే.. స్పిన్ బౌలింగ్‌లో ఇబ్బంది పడే బలహీనతను మరోసారి బయటపెట్టిన తిలక్ (11 బంతుల్లో 6)ను బ్రేస్‌వెల్ డగౌట్ చేర్చాడు.

ఓ దశలో 21 బంతుల్లో ఒక్క బౌండరీ రాకపోవడంతో 122/4తో టీమిండియా డీలా పడింది. ఈ క్లిష్ట సమయంలో అక్షర్ పటేల్ (24)తో కలిసి కెప్టెన్ శ్రేయస్ బాధ్యతాయుతంగా ఆడి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఈ ఇద్దరూ స్పిన్నర్లను దీటుగా ఎదుర్కొంటూ జట్టును రేసులో నిలిపారు. హెన్రీ వేసిన 14వ ఓవర్లో రెండు సిక్సర్లు కొట్టిన అయ్యర్ టీమ్‌ను తిరిగి రేసులోకి తెచ్చాడు. తర్వాతి ఓవర్లోనే ఫెర్గూసన్.. అక్షర్‌ను ఔట్ చేయడంతో మ్యాచ్ మళ్లీ కివీస్ చేతిలో వెళ్లేలా కనిపించింది.

అదే ఓవర్లో 27 పరుగుల వద్ద క్యాచ్ ఔట్ నుంచి అయ్యర్ బయటపడ్డాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన యువ ఆటగాడు నమన్ ధీర్ తీవ్ర ఒత్తిడిలో అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. శాంట్నర్ బౌలింగ్‌లో 6,4.. నేథన్ స్మిత్ వేసిన 17వ ఓవరలో రెండు ఫోర్లతో జోరందుకున్నాడు. 24 పరుగుల వద్ద ఫెర్గూసన్ క్యాచ్ డ్రాప్ చేయడంతో లభించిన చాన్స్‌ను అతను రెండు చేతులా ఒడిసిపట్టుకున్నాడు. చివరి 12 బంతుల్లో 16 రన్స్ అవసరమైన సమయంలో 19వ ఓవర్ తొలి బంతికే అయ్యర్ ఔటైనా.. నమన్ రెండు ఫోర్లు, ఓ సిక్స్‌తో మ్యాచ్ ముగించాడు.

భారత్‌కు ఒక్క రోజే 26 మెడల్స్

నగోయా (జపాన్): పారా ఆసియా గేమ్స్‌లో భారత క్రీడాకారులు అసాధారణ ప్రతిభతో దూసుకుపోతున్నారు. వైకల్యాన్ని అధిగమించి బరిలోకి దిగి పతకాల మోతలో పోటీ పడుతున్నారు. గురువారం ఒక్క రోజే 7 స్వర్ణాలు సహా 26 పతకాలు తెచ్చారు. ఇందులో రెండు చేతులు లేకున్నా.. ఆర్చరీలో అద్భుతాలు సృష్టిస్తున్న 19 ఏండ్ల యువ సంచలనం శీతల్ దేవి హైలైట్‌గా నిలిచింది. రెండు గంటల వ్యవధిలో రెండు స్వర్ణ పతకాలను కైవసం చేసుకొని తన ప్రతిభను మరోసారి చాటుకుంది. అథ్లెటిక్స్ విభాగం నుంచి ఒకే రోజు ఆరు స్వర్ణాలతో పతకాల ప్రవాహం కొనసాగడంతో భారత్ ఖాతాలో మొత్తం 88 మెడల్స్ చేరాయి. 21 స్వర్ణాలు, 26 రజతాలు, 41 కాంస్య పతకాలతో భారత్ నాలుగో స్థానంలో కొనసాగుతోంది.



శీతల్ డబుల్ మ్యాజిక్

జమ్మూ కాశ్మీర్‌కు చెందిన ప్రపంచ పారా చాంపియన్ శీతల్ దేవి రెండు స్వర్ణాలతో మెరిసింది. పారా ఆర్చరీ మిక్స్‌డ్ డబుల్స్‌లో తోమన్ కుమార్‌తో కలిసి బరిలోకి దిగిన శీతల్ 151-148తో ఇండోనేషియా జోడీ తియోడోరా ఆడి అయూడియా- కెన్ స్వాగుమిలాగ్‌పై విజయం సాధించి ఈ విభాగంలో స్వర్ణాన్ని నిలబెట్టుకుంది. ఆ తర్వాత వ్యక్తిగత ఫైనల్లో తనదైన గురితో మెప్పించిన శీతల్ 142-139తో సియాహిదా (సింగపూర్)ను ఓడించి మరో పసిడి పతకాన్ని ముద్దాడింది. ఆర్చరీ డబ్ల్యూ 1 విభాగం ఫైనల్లో ఓడిన స్వాతి చౌదరి రజతం సాధించి ఈ విభాగంలో భారత్‌కు తొలి పతకం అందించిన ఆర్చర్‌గా రికార్డు సృష్టించింది.

అథ్లెటిక్స్‌లో అదుర్స్

అథ్లెటిక్స్‌లో భారత పరుగు వీరుల హవా నడుస్తోంది. పురుషుల హై జంప్ టీ63 విభాగంలో శైలేష్ కుమార్ నేతృత్వంలో భారత్ క్లీన్ స్వీప్ చేసింది. ఫైనల్లో శైలేష్ 1.89 మీటర్ల ఎత్తును అధిగమించి గేమ్స్ రికార్డుతో దేశానికి పసిడి అందించాడు. వరుణ్ భాటి (1.84 మీ), రాహుల్ (1.81 మీ) రజతం, కాంస్యం సాధించారు. స్ప్రింటర్లు అంజనాబెన్ బంబడియా, దిలీప్ మహదు గావిట్ కూడా సత్తా చాటారు. మహిళల 400మీ టీ47 విభాగంలో అంజనాబెన్ (59.97 సె), జయంతి బెహెరా (1:00.65 సె) స్వర్ణం, రజతం గెలిచారు.

గావిట్ పురుషుల 400మీ టీ47 రేసును 48.27 సెకన్లలో పూర్తి చేసి గోల్డ్ గెలుచుకున్నాడు. మహిళల డిస్కస్ త్రో ఎఫ్54 విభాగంలో సువర్ణ రాజ్ 15.66 మీటర్ల ప్రయత్నంతో స్వర్ణం ఖాతాలో వేసుకుంది. వీల్‌చైర్ పరిమితం అయిన 44 ఏండ్ల సువర్ణ తన నాలుగు ప్రయత్నాల్లోనూ 15 మీటర్లను అధిగమించడం విశేషం. ఇక, లాంగ్ జంపర్ ధర్మరాజ్ సోలైరాజ్ టీ44/టీ62/టీ64 విభాగాల కలయికతో జరిగిన పోటీలో 7.15 మీటర్ల దూరాన్ని అధిగమించి, ఆసియా రికార్డును నెలకొల్పుతూ బంగారు పతకాన్ని నిలబెట్టుకున్నాడు. మహిళల 400మీ టీ12 విభాగంలో దృష్టి లోపం ఉన్న తేజల్‌బెన్ దామోర్ (57.60 సె) సిల్వర్ నెగ్గింది. పారా అథ్లెటిక్స్ విభాగం ఒక్కటే భారత్‌కు ఇప్పటికి 18 స్వర్ణాలతో కలిపి మొత్తం 52 పతకాలను అందించింది.

ఏపీ స్విమ్మర్ రవి హ్యాట్రిక్.. కొలనులోనూ జోరు

స్విమ్మింగ్ పూల్‌లోనూ భారత క్రీడాకారులు సత్తా చాటారు. ఆంధ్రప్రదేశ్ టీనేజ్ పారా స్విమ్మర్ రవి బుడిగిన పురుషుల 50 మీటర్ల ఫ్రీస్టయిల్ ఎస్13 విభాగంలో కాంస్యం సాధించి టోర్నమెంట్‌లో హ్యాట్రిక్ పతకాలు పూర్తి చేసుకున్నాడు. దృష్టి లోపం ఉన్న 18 ఏండ్ల రవి 25.89 సెకండ్ల టైమింగ్‌తో కాంస్యం నెగ్గాడు. 400 మీటర్ల ఫ్రీస్టయిల్ ఎస్10 విభాగంలో కపిల్ (4:38.44సె) రెండో స్థానంతో రజతం నెగ్గగా, పురుషుల 100 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్ ఎస్బీ9 విభాగంలో స్వాతిక్ (1:13.77 సె), ఎస్7 ఈవెంట్‌లో తేజస్ (1:18.58సె) కాంస్యాలు ఖాతాలో వేసుకున్నారు.

బ్యాడ్మింటన్‌లో మెరుపులు

బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 సెమీఫైనల్లో పారా ఆసియా చాంపియన్ ప్రమోద్ భగత్ 2 గంటల 9 నిమిషాల మారథాన్ పోరులో 16-21, 21-18, 21-17తో లీ సియోంగ్‌హు (కొరియా) ఓడించి ఫైనల్ చేరాడు. తుది పోరులో అతను మరో భారత షట్లర్ నితేష్ కుమార్‌తో తలపడనున్నాడు. నవీన్ శివకుమార్ (పురుషుల సింగిల్స్ ఎస్ఎల్4) కూడా ఫైనల్లో అడుగు పెట్టగా.. నితేష్ కుమార్ సింగిల్స్‌తో పాటు మిక్స్‌డ్ డబుల్స్ లో తులసిమతి మురుగేశన్‌తో కలిసి ఫైనల్‌కు చేరుకుని రెండు స్వర్ణాల రేస్‌లో నిలిచాడు. ఇక, టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్ 7 విభాగంలో భవినా పటేల్- శుభమ్ వాధ్వా జోడీ సెమీఫైనల్లో పోరాడి కాంస్య పతకంతో సంతృప్తి చెందింది.

ప్రత్యేక శక్తులున్న స్త్రీ కథ



జ్యోతి పూర్వాజ్, పూర్వాజ్ లీడ్‌రోల్స్ చేసిన థ్రిల్లర్ మూవీ 'కిల్లర్'. పూర్వాజ్ స్వీయ దర్శకత్వంలో ఎ.పద్మనాభరెడ్డితో కలిసి నిర్మించిన ఈ చిత్రం ఈనెల 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ప్రముఖ దర్శకుడు హరీష్‌శంకర్ ట్రైలర్‌ని విడుదల చేశారు. 'జ్యోతి పూర్వాజ్ ఇందులో విభిన్నమైన పాత్రల్లో కనిపిస్తారు. ప్రత్యేక శక్తులున్న మహిళగా ఇందులో ఆమె పాత్ర సాగుతుంది. ఆమె ఎవరు? అంటూ సాగే పోలీస్ ఇన్వెస్టిగేషన్ ఆసక్తికరంగా ఉంటుంది.

2024, 25, 26.. ఈ మూడేళ్ల నేపథ్యంతో మూడు డిఫరెంట్ లేయర్లతో కథ సాగుతుంది. ఇంటర్వెల్ బ్యాంగ్ సినిమాకు హైలైట్. ఇలాంటి సినిమా ఇప్పటివరకూ ఇండియన్ స్క్రీన్‌పై రాలేదు' అని దర్శకనిర్మాత, నటుడు పూర్వాజ్ తెలిపారు. ఇలాంటి వినూత్నమైన సినిమాను తీసిన పూర్వాజ్‌ను చూస్తుంటే గర్వంగా ఉందని జ్యోతిపూర్వాజ్ అన్నారు. ఇంకా మరో నిర్మాత పద్మనాభరెడ్డి, నటుడు గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి, డీవోపీ జగదీశ్ బొమ్మిశెట్టి, ఎడిటర్ బి.మనోజ్‌కుమార్ కూడా మాట్లాడారు.

బ్రూక్ రికార్డు డబుల్

అయినా ఇంగ్లండ్‌కు తప్పని ఓటమి



రావల్పిండి: కెప్టెన్ హ్యారీ బ్రూక్ (202) వన్డేల్లో ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీతో పాటు ఈ ఫార్మాట్‌లో ద్విశతకం కొట్టిన ఇంగ్లండ్ తొలి ఆటగాడిగా రికార్డు సృష్టించినా తన జట్టును గెలిపించలేకపోయాడు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 2 వికెట్ల తేడాతో ఇంగ్లిష్ టీమ్‌ను ఓడించి బెురా అనిపించింది.430 పరుగుల లక్ష్యాన్ని 8 వికెట్లు కోల్పోయి మరో బంతి మిగిలుండగానే అందుకొని వన్డేల్లో రెండో అత్యధిక ఛేదనతో రికార్డుకెక్కింది. పవన్ రత్నాయకే (130), అవిష్క (97), షనక (97)తో పాటు చివర్లో లియానగే (27 బంతుల్లో 61 నాటౌట్) మెరుపు బ్యాటింగ్‌తో లంకను గెలిపించారు. తొలుత ఇంగ్లండ్ 50 ఓవర్లలో 429/4 స్కోరు చేసింది. 114 బంతుల్లో ద్విశతకానికి చేరిన బ్రూక్ గత నెల వెస్టిండీస్‌పై భారత సారథి శుభ్‌మన్ గిల్ 117 బంతుల్లో నెలకొల్పిన ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ రికార్డును బ్రేక్ చేశాడు.

రెండో టెస్టులో సఫారీల ఘన విజయం

గెబెహా: సొంతగడ్డపై ఆస్ట్రేలియా చేతిలో తొలి టెస్టు ఓటమికి దక్షిణాఫ్రికా వెంటనే ప్రతీకారం తీర్చుకుంది. గురువారం ముగిసిన రెండో మ్యాచ్‌లో అద్భుతమైన బౌలింగ్‌తో ఇన్నింగ్స్ 31 పరుగుల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసి మూడు టెస్టుల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 156/4తో ఫాలోఆన్‌తో చివరి రోజు ఆట కొనసాగించిన కంగారూ టీమ్ రెండో ఇన్నింగ్స్‌లో 295 పరుగులకే ఆలౌటై చిత్తుగా ఓడింది. ట్రావిస్ హెడ్ (121) శతకంతో పోరాడినా.. రబాడ (4/77), ముల్డర్ (3/64), హార్మర్ (2/93) ఆసీస్ పని పట్టారు. తొలి ఇన్నింగ్స్‌ను సఫారీ టీమ్ 425/9 స్కోరు వద్ద డిక్లేర్‌చేయగా.. ఆసీస్ 99కే ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ శతకం చేసిన బవూమకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

టీమిండియాను చాపెల్ ముక్కలు చేశాడు..

- భారత క్రికెట్‌లో అదే చీకటి అధ్యాయం: హర్భజన్ సింగ్
- గ్రెగ్ చాపెల్ కోచింగ్ కాలాన్ని చీకటి అధ్యాయంగా అభివర్ణించిన హర్భజన్
- జట్టులో 'విభజించు పాలించు' విధానాన్ని అమలు చేశాడని తీవ్ర ఆరోపణ
- సౌరవ్ గంగూలీతో చాపెల్ దారుణంగా ప్రవర్తించాడని వెల్లడి
- ఆటగాళ్ల మధ్య గొడవలు పెట్టి జట్టు ఐక్యతను దెబ్బతీశాడని విమర్శ
- 2007 ప్రపంచకప్‌లో ఘోర వైఫల్యానికి చాపెల్ విధానాలే కారణమని వ్యాఖ్య



భారత క్రికెట్ జట్టు మాజీ కోచ్ గ్రెగ్ చాపెల్‌పై మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ సంచలన ఆరోపణలు చేశాడు. చాపెల్ కోచింగ్‌లో ఉన్న రెండేళ్ల కాలాన్ని భారత క్రికెట్ చరిత్రలోనే ఒక 'చీకటి అధ్యాయం'గా అభివర్ణించాడు. జట్టులో 'విభజించు, పాలించు' అనే దుర్మార్గపు విధానాన్ని అమలు చేసి, ఆటగాళ్ల మధ్య చిచ్చు పెట్టాడని తీవ్రంగా విమర్శించాడు. ఇటీవల ప్రఖర్ గుప్తా పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ భజ్జీ ఈ వ్యాఖ్యలు చేశాడు.2003 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన బలమైన భారత జట్టుకు 2005లో గ్రెగ్ చాపెల్ కోచ్‌గా నియమితులయ్యాడు. అయితే, అతని రాకతో జట్టులో ఐక్యత పూర్తిగా దెబ్బతిన్నదని హర్భజన్ ఆరోపించాడు. "ఆ రోజుల్లో చాపెల్.. దాదా (సౌరవ్ గంగూలీ)తో ప్రవర్తించిన తీరు, జట్టుతో వ్యవహరించిన పద్ధతి భారత క్రికెట్ చరిత్రలోనే అత్యంత దారుణమైన, చెత్త దశ. ఆటగాళ్ల మధ్య గొడవలు సృష్టించి తను చక్రం తిప్పాలనుకున్నాడు. దాని ఫలితంగా ఒకప్పుడు ప్రాణ స్నేహితుల్లా ఉన్న సహచరులు ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం మానేశారు" అని భజ్జీ ఆవేదన వ్యక్తం చేశాడు.ఈ విభజన వెనుక కుట్ర కోణం ఉండవచ్చని హర్భజన్ అనుమానం వ్యక్తం చేశాడు. ఆ సమయంలో ఆస్ట్రేలియాకు గట్టి పోటీ ఇవ్వగల ఏకైక జట్టుగా భారత్ ఉందని, అలాంటి జట్టును బలహీనపరిస్తే మైదానంలో ఓటమి ఖాయమనే వ్యూహంతో చాపెల్ ఉద్దేశపూర్వకంగానే ఇలా చేసి ఉండవచ్చని అభిప్రాయపడ్డాడు.చాపెల్ విధానాల వల్లే 2007 వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా ఘోరంగా విఫలమైందని హర్భజన్ పరోక్షంగా తెలిపాడు. ఆ టోర్నీలో బంగ్లాదేశ్ వంటి చిన్న జట్టు చేతిలో ఓడి, గ్రూప్ దశలోనే భారత్ ఇంటిదారి పట్టడం అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. సీనియర్ ఆటగాళ్లతో బహిరంగ విభేదాలు, వివాదాలతో నిండిన చాపెల్ కోచింగ్ శకం ఆ ప్రపంచకప్ వైఫల్యంతోనే ముగిసింది. హర్భజన్ తాజా వ్యాఖ్యలతో చాపెల్ కోచింగ్‌పై ఉన్న పాత వివాదాలు మరోసారి తెరపైకి వచ్చాయి.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609